teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 343 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 4 మే 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## పాకిస్తాన్ నుండి ఇన్‌బౌండ్ మెయిల్‌ను నిలిపివేసిన భారత్

న్యూ ఢిల్లీ, మే 03 (తీన్మార్ న్యూస్): పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో పాకిస్తాన్ నుండి వచ్చే అన్ని రకాల మెయిల్ మరియు పార్శిళ్ల మార్పిడిని భారతదేశం నిలిపి వేసింది. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో, ప్రభుత్వం వాయు మరియు ఉపరితల మార్గాల ద్వారా వచ్చే మెయిల్ మరియు పార్శిళ్ల మార్పిడిని నిలిపివేయాలని నిర్ణయించిందని కమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ తెలిపింది.



## అటకెక్కిస్తున్న రైతు బీమా

రైతు కుటుంబాలకు ధీమా రైతు బీమా

ఇది ఖచ్చితంగా రైతు వ్యతిరేక ప్రభుత్వమే

బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు



హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): రైతు కుటుంబాలకు ధీమానిచ్చే రైతు బీమాను అటకెక్కిస్తున్నారని, ఇది ఖచ్చితంగా రైతు వ్యతిరేక ప్రభుత్వమేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శించారు. రైతు బీమా పథకం పై ట్విట్టర్ వేదికగా స్పందించిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో

మిగతా 2 లో



# పోలీసు వాహనాలు.. పెండింగ్లో చలాన్లు

## నిబంధనల ఉల్లంఘనల చలానాలు 17,391

ఈ చలానాల కింద మొత్తం రూ.68,67,885 పెండింగ్

ఆర్టీఐ కింద దరఖాస్తు చేయగా వెల్లడైన వివరాలు

పోలీసులపై ప్రజల తీవ్ర విమర్శలు




ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పదే పదే చెప్పే పోలీసులే ఆ నియమాలు తమకు పట్టవన్నట్టు ప్రవర్తిస్తున్నారు. పోలీసు సిబ్బంది, అధికారులు వాడే వాహనాలు సాధారణంగా తెలంగాణ డీజీపీ పేరిట రిజిస్ట్రేషన్ అయి ఉంటాయి. ఇలా డీజీపీ పేరిట ఉన్న పోలీసు వాహనాలపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 17,391 పెండింగ్ చలానాలు ఉన్నాయి.




## నల్గొండ జిల్లా.. తీవ్రవాదులకు అడ్డా

ఎక్కడ ఉగ్రదాడులు జరిగినా మూలాలు నల్గొండలోనే

మదర్సాలపై ఎందుకు నిఘా పెట్టడం లేదు

కార్యకలాపాలు ఎందుకు బయటకు రావడం లేదు

ఉగ్రవాదులకు నల్గొండ సేఫ్ జోన్ గా మారింది

ఎవరి అనుమతితో మదర్సాలు నడుస్తున్నారు

ప్రశ్నించిన ఎంపీ రఘునందన్ రావు

ఎంపీ రఘునందన్ రావు సంచలన వాఖ్యలు




02

## ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వబోతున్నాం

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



హన్మకొండ, మే 03 (తీన్మార్ న్యూస్): కలెక్టర్ వెరిఫై చేసిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వబోతున్నామని రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హనుమకొండ

మిగతా 2 లో

## నిబంధనల ప్రకారమే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి

అలాంటి వాటికే ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుంది

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



02



02

## హైదరాబాద్ సిటీలో దంచికొట్టిన వాన

ఈదురు గాలులతో కురిసిన భారీవర్షం

రోడ్లపై నీరు చేరడంతో

వాహనదారులు తప్పని ఇబ్బందులు

## రాంగ్ రూట్లో ప్రయాణించేవారిపై కొరడా ఝులిపించనున్న పోలీస్

ట్రాఫిక్ రహితంగా

హైదరాబాద్ కు "పోలీసులు" కంకణం

మహానగరంలో ప్రత్యేక డ్రైవ్‌లు

నిర్వహిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ ఉల్లంఘించేవారికి భారీ జరిమానాలు






## కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్

నాటి నుండి నేటి వరకు ఎం చేశారానేదానిపై సమీక్ష

హామీలను నెరవేరుస్తున్నారా..?

పలు అంశాలపై సీఎం రిపోర్ట్ తెప్పించుకున్నట్టు సమాచారం

తెలంగాణ బ్యూరో, మే 03 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టారు. ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు ఎం చేశారానేదానిపై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు

మిగతా 2 లో

## సీఎం రేవంత్‌రెడ్డి తులం బంగారం ఎక్కడా..?

ఏడాది పాలన గడిచినా నేటికీ అమలు నోచుకోని హామీ

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సబితా ఇంద్రా రెడ్డి



హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): పేదింటి ఆడబిడ్డల పెళ్లి తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశ్యంతో దేశంలోనే తొలిసారి మాజీ సీఎం కెసిఆర్ విప్లమాత్మకంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు శ్రీకారం చుట్టారని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లకు చెందిన 99 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను సరూర్‌నగర్

మిగతా 2 లో



## ట్విట్టర్‌లో పిర్యాదు చేస్తే సస్పెండ్ చేస్తారా..?

ఆర్టీసీ ఎండి సజ్జనార్ పై SWU సంచలన వాఖ్యలు

తెలంగాణ బ్యూరో, మే 03 (తీన్మార్ న్యూస్): ట్విట్టర్‌లో పిర్యాదు చేస్తే సస్పెండ్ చేస్తారా.. ఖాబర్దార్ అంటూ ఆర్టీసీ ఎండి సజ్జనార్ పై SWU రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంచలన వాఖ్యలు చేశారు. ట్విట్టర్‌లో ఫిర్యాదు వస్తే న్యాయవిచారణ చేయకుండానే సస్పెండ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం

మిగతా 2 లో

## ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీ

వేయి ఎకరాల్లో ప్రత్యేకంగా ఎలెక్ట్రానిక్ సిటీ

యువతకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ

మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన

02





02

## మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరత లేదు

రహదారుల విస్తరణ వేగంగా జరుగుతోంది

ఫ్లైఓవర్స్, ఎక్స్‌ప్రెస్‌వేలు, రింగ్ రోడ్‌లు నిర్మిస్తున్నాం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

## ఏపీ నుంచి రాష్ట్రానికి ధాన్యం రాకుండా అడ్డుకున్న పోలీసులు

బోనస్ కాజేసేందుకు ధాన్యం అక్రమ రవాణాకు

ఈ మేరకు తెలంగాణ బార్డర్‌లో పోలీసుల ఆంక్షలు

ఏడు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం



02

# పోలీసు వాహనాలు.. పెండింగ్లో చలాన్లు

తెలంగాణ బ్యూరో, మే 03 (తీన్మార్ న్యూస్): ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పదే పదే చెప్పే పోలీసులే ఆ నియమాలు తమకు పట్టవన్నట్టు ప్రవర్తిస్తున్నారు. పోలీసు సిబ్బంది, అధికారులు వాడే వాహనాలు సాధారణంగా తెలంగాణ డీజీపీ పేరిట రిజిస్ట్రేషన్ అయి ఉంటాయి. ఇలా డీజీపీ పేరిట ఉన్న పోలీసు వాహనాలపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 17,391 పెండింగ్ చలానాలు ఉన్నాయి. ఈ చలానాల కింద మొత్తం రూ.68,67,885 చెల్లించాల్సి ఉంది. హైదరాబాద్ ట్రాఫిక్ మన్ గా పేరుపొందిన లోకేంద్రసింగ్ అనే వ్యక్తి ఆర్టీఐ కింద దరఖాస్తు చేయగా, ఈ మేరకు వివరాలు వెల్లడయ్యాయి. ఇది నిజంగా ప్రజలకు చెడ్డ ఉదాహరణ. నేను ట్రాఫిక్ పోలీసులను చాలా గౌరవిస్తాను. అలాగే చట్టాన్ని అమలు చేసే అధికారుల పారదర్శకత, జవాబుదారీతనం పట్ల



నాకు నమ్మకం ఉంది. భవిష్యత్తులో పోలీసులు ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలకు పాల్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీజీపీ ఆదేశిస్తారని నేను ఆశిస్తున్నాను అని లోకేంద్రసింగ్ పేర్కొన్నారు. పోలీసు వాహనాలపై పెద్ద ఎత్తున చలాన్లు పెండింగ్ లో ఉండటంతో నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. 'చలాన్ల చెల్లింపుపై ట్రాఫిక్ వాళ్లు పెట్టిన డిస్కౌంట్ ఆఫర్లు వీళ్లు మర్చిపోయినట్టు కనిపిస్తోంది'అని ఒకరు. 'ఈ వాహనాలను కూడా ప్రయాణం మధ్యలో ఆపి, మిగతా వారందరికీ చేస్తున్నట్లుగా, డబ్బు చెల్లించిన తర్వాతే వాహనాలను ముందుకు అనుమతించాలి'అని మరొకరు కామెంట్ చేశారు. 'ఈ మొత్తాన్ని ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల నుంచి చెల్లిస్తారు. కానీ, జరిమానాలను ఆ వాహనాలను నడిపిన డ్రైవర్ల నుంచి వసూలు చేయాలి అని మరొకరు కామెంట్ పెట్టారు.

## అటకెక్కిస్తున్న రైతు బీమా

మొదటి పేజీ తరువాయి



విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా హరీష్ రావు ఏ కారణంతో అయినా, రైతు మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడకుండా కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో కేసీఆర్ ప్రారంభించిన రైతు బీమా పథకాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అలాగే ఫిబ్రవరి నెలలోనే చెల్లించాల్సిన రూ. 775 కోట్ల ప్రీమియం మూడు నెలలుగా ప్రభుత్వం చెల్లించకపోవడం శోచనీయమని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, రైతు కుటుంబాలకు శాపంగా మారుతున్నదని అన్నారు. అసలు రాష్ట్రంలో రైతు బీమా పథకం కొనసాగుతున్నదా? లేదా అటకెక్కించారా అనే అనుమానం కలుగుతుందన్నారు. వానాకాలం రైతు బంధు ఎగ్గొట్టారు అని, యాసంగి పైసలు ఎప్పుడు ఇస్తారు. అని మేము అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు మార్చి 31 లోగా మొత్తం చెల్లిస్తామని చెప్పి మాట తప్పారని, మొత్తంగా రైతు బంధు పథకాన్ని ప్రశ్నార్థకం చేసారని దుయ్యబట్టారు. రుణమాఫీ హామీ విషయంలో మేము వెంటబడితే దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పారని, సగం మందికి కూడా రుణమాఫీ చేయకుండా రైతుల ఉసురుపోసుకున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు రైతు కుటుంబాలకు ధీమా ఇచ్చే రైతు బీమా పథకాన్ని లేకుండా చేస్తున్నారని, ఇంతకంటే అమానుషం ఏమైనా ఉంటదా? ఇది కచ్చితంగా రైతు వ్యతిరేక ప్రభుత్వమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలన గాలికి వదిలేసి గాలి మోటార్లలో చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రి, మంత్రులకు రైతు కుటుంబాల కన్నీళ్లు కనిపించడం లేదా? అని నిలదీశారు. వివిధ కారణాలతో గడిచిన మూడు నెలల్లో సుమారు వందకు పైగా రైతులు చనిపోయినట్లు తెలుస్తోందని, ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో ఆయా కుటుంబాలకు రైతు బీమా సాయం అందకుండా పోయిందని తెలిపారు. ఒకవైపు కుటుంబ పెద్దను కోల్పోయి, మరోవైపు రైతు బీమా అందక ఆ కుటుంబాలు తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నాయని చెప్పారు. ఇక రైతు కుటుంబాలకు ప్రభుత్వమే రూ. 5 లక్షలు చెల్లించి, ఎల్ఐసీ కి పెండింగ్ లో ఉన్న ప్రీమియం తక్షణం కట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ పక్షాన హరీష్ రావు డిమాండ్ చేశారు.

## సీఎం రేవంత్‌రెడ్డి తులం బంగారం ఎక్కడా..?

మొదటి పేజీ తరువాయి



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేసీఆర్ ఇచ్చే రూ.1,00,116 తో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన గడిచినా నేటికీ అమలు చేయలేదని, రేవంత్‌రెడ్డి తులం బంగారం ఎక్కడా అని ఆమె ప్రశ్నించారు. 420 హామీలకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ ఏ ఒక్క హామీని సరిగా అమలు చేయలేదని, ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని తాము వదిలిపెట్టకుండా ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, నాయబ్ తహసీల్దార్ జంగయ్య, సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత, కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరత లేదు

హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణ వేగంగా జరుగుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరత లేదని చెప్పారు. ఫ్లైఓవర్స్, ఎక్స్‌ప్రెస్‌వేలు, రింగ్ రోడ్‌లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్-శ్రీశైలం మధ్య దూరం తగ్గేలా ఎలివేటెడ్ కారిడార్‌పై కేంద్రం దృష్టి పెట్టిందని తెలిపారు. హైదరాబాద్-విజయవాడ హైవేను ఆరు లేన్లుగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో భూసేకరణ కాకపోవడంతో కొన్ని పనులు ఆలస్యం అవుతున్నాయని కిషన్ రెడ్డి వెల్లడించారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తరువాత రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. తెలంగాణ 33 జిల్లాల్లో 32 జిల్లాల మీదుగా జాతీయ రహదారులు వెళ్లుతున్నట్లు తెలిపారు. శనివారం నాంపల్లిలోని బీజేపీ ఆఫీస్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. 2014లో తెలంగాణలో 2500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారులు ఉండగా, ప్రస్తుతం అవి సుమారు 5200 కిలోమీటర్లకు పెరిగాయని అన్నారు. గత పదేళ్లలో రూ.1,25,485 కోట్లు జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో అనేక జాతీయ రహదారి ప్రాజెక్టులు, కీలక ఎకనామిక్ కారిడార్లు, పర్యాటక ప్రోత్సాహక ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తున్నదన్నారు. కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణలో మరిన్ని రోడ్ల నిర్మాణాలను ప్రారంభించేందుకు, మరికొన్ని నూతన ప్రాజెక్టులకు భూమిపూజ చేసేందుకు ఈనెల 5వ తేదీన రానున్నట్లు తెలిపారు. సుమారు రూ. 5,416 కోట్లతో 167 కి.మీ. మేర మొత్తం 26 ప్రాజెక్టుల పనులకు సంబంధించిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలు జరగనున్నాయని అన్నారు.

## ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వబోతున్నాం

మొదటి పేజీ తరువాయి



కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సివిల్ సప్లై, ఇరిగేషన్ శాఖలపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్రంలో చారిత్రక, విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సన్న బియ్యంతో కడుపునిండా అన్నం పెడుతున్న ప్రభుత్వం తమదేనని ఎంత ఖర్చైనా సరే నిరుపేదలకు సన్న బియ్యం అన్నం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్, వ్యవసాయ శాఖలకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఇందులో భాగంగానే ఏ రాష్ట్రంలో పండని విధంగా తెలంగాణలో వానాకాలం, యాసంగిలో వరి పండిందని తెలిపారు. రాష్ట్రంలో 2.80 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారని రెండు సీజన్లలో తెలంగాణలో పండినంత ధాన్యం ఉమ్మడి రాష్ట్రంలో కూడా పండలేదన్నారు. రబీ, యాసంగి సీజన్లలో సన్న ధాన్యానికి రూ.500 రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌ను ఇస్తోందని ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. ఎఫ్‌సీఐకు ధాన్యం అమ్మే రాష్ట్రాలలో తెలంగాణే ముందు వరుసలో ఉందని తెలిపారు. దేవాధుల ప్రాజెక్టును పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. దేవున్నపేట శివారులోని దేవాదుల పంప్ హౌస్‌ను కూడా సందర్శించామన్నారు. భద్రకాళి చెరువు పునరుద్ధరణ పనులను, సుందరీకరణ పనులను భారీ స్థాయిలో చేపట్టామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను ఈ సీజన్‌లో పూర్తి చేస్తామన్నారు. రైతులకు నీరందించి సాగును సస్యశ్యామలంగా చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. రైతన్నల అద్భుతంగా పంటలను పండించారన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రైతుల నుంచి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు అందరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్

మొదటి పేజీ తరువాయి



ఎన్ని రోజులు నియోజకవర్గంలో ఉంటున్నారు. ప్రజలను కలుస్తున్నారా.. ఎన్నికల సమయంలో లోకల్‌గా ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారా.. అనే అంశాలపై సీఎం రిపోర్ట్ తెప్పించుకున్నట్టు తెలుస్తోంది. ఆ నివేదిక ఆధారంగా సమీక్ష చేస్తున్నట్టు సమాచారం. దీనికి సంబంధించిన 9 ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.

**9 ముఖ్యమైన అంశాలు:**

1.సీఎం రేవంత్ రెడ్డి సొంత పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్షలు ప్రారంభించారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు.. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గంలో ఏమేం పనులు చేశారు, ప్రభుత్వ పథకాలపై ఎలాంటి ప్రచారం చేశారని ఆరా తీస్తున్నారు. పార్టీ బలోపేతం కోసం చేసిన కార్యక్రమాల వివరాలు సేకరిస్తున్నారు.

2.నియోజకవర్గంలోని సమస్యలను తెలుసుకునేందుకు ఒక్కో ఎమ్మెల్యేతో ప్రత్యేకంగా భేటీ అవుతానని.. జపాన్ పర్యటనకు వెళ్లేముందు జరిగిన సీఎల్పీ సమావేశంలో రేవంత్ ప్రకటించారు. అందులో భాగంగా గురువారం నాడు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

3.సొంత జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల పనితీరును తెలుసుకునేందుకు ముందుగా.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో సీఎం భేటీ అయ్యారు. అందరినీ ఒకేసారి కూర్చోపెట్టి మాట్లాడకుండా.. ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడారు.

4.నియోజకవర్గంలోని సమస్యలు, రాజకీయ పరిస్థితులపై సీఎం నేరుగా చర్చించారు. ఈ 17 నెలల కాలంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం ఖర్చు చేసిన నిధులు వివరాలను సదరు ఎమ్మెల్యేల ముందు పెట్టినట్లు సమాచారం.

5.ప్రభుత్వం తరపున ఇన్ని కార్యక్రమాలు చేశాం.. మీరు ఏం చేశారో చెప్పండి? పథకాల ప్రచారం కోసం ఏమేం కార్యక్రమాలు చేశారు? ఎన్ని గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించారు. ఎక్కడ పాదయాత్రలు చేపట్టారు? పార్టీ కార్యకర్తలతో ఎన్ని సార్లు మీటింగ్ జరిపారు? అనే వివరాలను పేపర్‌పై రాసివ్వాలని సీఎం అడిగినట్టు సమాచారం.

6.రానున్న కాలంలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలో లిఖితపూర్వకంగా రాసివ్వాలని.. ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి కోరినట్టు తెలుస్తోంది. అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలపైనా ఆరా తీసినట్లు సమాచారం.

7.కొందరు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంపై దృష్టి పెట్టకుండా.. తమకు తెలిసిన కాంట్రాక్టర్ల బిల్లులు రిలీజ్ చేయాలని సీఎం ముందు ప్రస్తావించే ప్రయత్నం చేసినట్టు సమాచారం. సీఎం బిల్లుల విషయాన్ని పట్టించుకోకుండా.. నియోజకవర్గంలో ఇంకా చేపట్టాల్సిన పనులను వివరించాలని మందలించినట్టు తెలిసింది.

## ఏపీ నుంచి రాష్ట్రానికి ధాన్యం రాకుండా అడ్డుకున్న పోలీసులు

నల్గొండ, మే 03 (తీన్మార్ న్యూస్): ఏపీ నుంచి తెలంగాణకు ధాన్యం రాకుండా నల్గొండ జిల్లా పోలీసులు అడ్డుకుంటున్నారు. ఈ మేరకు ప్రస్తుతం తెలంగాణ బార్డర్‌లో పోలీసులు ఆంక్షలు విధించారు. తాజాగా నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి బోర్డర్ చెక్ పోస్ట్ వద్ద ఆంధ్ర నుంచి వస్తున్న వరి ధాన్యం లారీలను పోలీసులు పట్టుకున్నారు. సుమారుగా 2200 ధాన్యం బస్తాలు, ఏడు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.



ఈ నేపథ్యంలోనే ఆంధ్ర ధాన్యాన్ని తెలంగాణలో అక్రమంగా విక్రయిస్తున్న పలు దళారులపై పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న బోనస్ కాజేసేందుకు ధాన్యం అక్రమ రవాణాకు కేటుగాళ్లు తెరలేపినట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల ధాన్యం తెలంగాణలో విక్రయించేందుకు అనుమతి లేదనీ పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ - తెలంగాణ సరిహద్దులైన కోదాడ, వాడపల్లి, నాగార్జునసాగర్ వద్ద చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేశారు. ధాన్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఇక, తాజాగా జరిగిన అక్రమ రవాణపై నల్గొండ డిఎస్పీ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నల్గొండ జిల్లా.. తీవ్రవాదులకు అడ్డా

హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రోహింగ్యాలకు షెల్టర్ గా మారిందన్నారు. నల్గొండ జిల్లా.. తీవ్రవాదులకు అడ్డాగా మారిందన్నారు. నల్గొండ నుంచి ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, మదర్సాలపై ఎందుకు నిఘా పెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. అక్కడ జరుగుతున్న కార్యకలాపాలు ఎందుకు బయటకు రావడం లేదని నిలదీశారు. దేశంలో ఎక్కడ ఉగ్రవాద దాడులు జరిగినా మూలాలు నల్గొండలోనే కనబడతాయని చెప్పారు. ఉగ్రవాదులకు నల్గొండ సేఫ్ జోన్ గా మారిందన్నారు. నల్గొండలో ఒవైసీ ఐఎసిస్ ఉగ్రవాదం, మరోవైపు వామపక్ష తీవ్రవాదం.. ఈ రెండూ బీజేపీ ఎదుగుదలను అడ్డుకుంటున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఎవరి అనుమతితో మదర్సాలు నడుస్తున్నాయని రఘునందన్ రావు ప్రశ్నించారు. మదర్సాలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? మదర్సాల లెక్క ఎందుకు బయటికి తీయడం లేదు? అని నిలదీశారు. మదర్సాల్లో కలెక్టర్, విద్యాశాఖ అధికారులు ఎందుకు తనిఖీలు చేయడం లేదని రఘునందన్ రావు అడిగారు. పహల్గాం ఘటన తర్వాత భారత్ లో ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశీయులను బయటికి పంపాలని కేంద్రం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు స్పష్టమైన ఆదేశాలిచ్చిందని రఘునందన్ రావు గుర్తు చేశారు. అయినా తెలంగాణ ప్రభుత్వానికి సోయి లేదని మండిపడ్డారు. కులగణన చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారు, కులగణన తప్పుల తడక అని కాంగ్రెస్ నేతలే ఒప్పుకున్నారని విమర్శించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇద్దరు మంత్రులున్నా ధాన్యం కొనుగోళ్లు చేయక అన్నదాతలను గోస పెట్టిస్తున్నారని వాపోయారు. ఎస్ఎల్ బీసీ టన్నెల్ ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను కూడా బయటికి తీయలేని చేతకాని ప్రభుత్వమిది అంటూ రేవంత్ సర్కార్ పై విరుచుకుపడ్డారు ఎంపీ రఘునందన్ రావు.

## నిబంధనల ప్రకారమే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి

హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు 400-600 చ.అడుగుల మధ్యే నిర్మించుకోవాలని అలాంటి వాటికే ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి మండలంలోని ఓ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేపట్టామని అయితే కొన్ని ప్రాంతాల్లో 600 చ.అడుగులు దాటి నిర్మించుకుంటున్నారని అలాంటి వాటికి బిల్లులు హోల్డ్ లో పెట్టామన్నారు. అయితే వీటిని పడగొట్టడం కంటే ప్రస్తుతానికి 600 చ.అడుగులు దాటి బేస్ మెంట్ పూర్తయిన ఇళ్లకు ఈ సారికి మినహాయింపు ఇచ్చి రూ.లక్ష రిలీజ్ చేస్తామని చెప్పారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా నిబంధనలకు మించిన విస్తీర్ణంలో బెస్ మెంట్ వరకు పూర్తయిన ఇళ్లు దాదాపు 300 వరకు ఉన్నాయని వీటికి మిహనహాయింపు ఇస్తామన్నారు. అయితే ఇది కేవలం బేస్ మెంట్ వరకు మాత్రమే మనిహాయింపు ఉంటుందని ఆపై జరిగే బ్రిక్స్ వర్క్ నిబంధనలకు అనుగుణంగా 400-600 చ.అడుగులలోపు నిర్మిస్తేనే మిగతా బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఈ మినహాయింపు కేవలం పైలట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మాణం అవుతున్న ఇళ్లకు మాత్రమే వర్తిస్తుందన్నారు. న్యాక్ లో శిక్షణ పూర్తి చేసుకున్న 390 మంది అసిస్టెంట్ ఇంజినీర్లకు శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**మంత్రిగా నేను ఫోన్ చేసినా ఆ పని చేయొద్దు:**

నిజమైన పేదలకే ఇళ్లు కేటాయించాలని దీనిలో మరో మాట లేదని మంత్రి అన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా ప్రతి ఇంటిని ట్రాక్ చేసేలా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ను పూర్తి స్థాయిలో వాడుతున్నామని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నాలుగు దశల్లో బిల్లులు చెల్లిస్తామన్నారు. ప్రతి సోమవారం అర్హులైన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించబోతున్నామని చెప్పారు. ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా చివరకు మంత్రిగా నేను ఫోన్ చేసినా ఫేజ్ ల వారీగా వర్క్ పూర్తి కాకుండా బిల్లుల కోసం సిఫార్సు చేయవద్దని ఇంజినీర్లు ఫేజ్-1 నుంచి ఫేజ్ -4 వరకు జాగ్రత్తగా సిఫారసు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలపై టోల్ ఫ్రీ నెంబర్ ఇస్తామని దాని ఫోన్ చేసి వివరాలు చెప్పాలన్నారు. తప్పు జరిగిందని చెబితే చాలు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. గృహనిర్మాణ శాఖకు మంచిపేరుతేవాలని ఇంజినీర్లకు సూచించారు.

## రాంగ్ రూట్లో ప్రయాణించేవారిపై కొరడా ఝులిపించనున్న పోలీస్

హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ రహితంగా మార్చేందుకు హైదరాబాద్ పోలీసులు కంకణం కట్టుకున్నారు. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘించేవారికి భారీ జరిమానాలు విధిస్తున్నారు. అయితే రాంగ్ రూట్‌లో వాహనదారులు ప్రయాణించడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసుల నివేదికల్లో తేలింది. దీంతో రాంగ్ రూట్‌లో ప్రయాణించేవారిపై కొరడా ఝులిపించాలని సైబరాబాద్ పోలీసులు నిర్ణయించారు. ఇప్పటివరకు ట్రాఫిక్ పోలీసులు మాత్రమే ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించేవారి ఫోటోలు తీసేవారు. లేదంటే జంక్షన్లలోని కెమెరాలు ద్వారా వారిని పసిగట్టేవారు. ఇకపై సరికొత్త ఆయుధాన్ని ప్రయోగించబోతున్నారు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు. రాంగ్ రూట్ డ్రైవింగ్ నివారణ కోసం తాజాగా సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎవరైనా వాహనదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తుంటే.. వారి ఫోటోలు తీసే అధికారాన్ని సాధారణ ప్రజలకు కల్పించారు. నిబంధన అతిక్రమించి, రాంగ్ రూట్‌లో వెళ్లేవారి ఫోటో తీసి తమకు పంపిస్తే.. సదరు వాహనదారులకు ఫైన్ విధిస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. ఈ మేరకు అధికారిక ఎక్స్ ఖాతాలో ట్వీట్ పెట్టారు. రాంగ్ రూట్‌లో వెళ్లేవారి ఫోటోలు, వీడియోలను తమ వాట్సాప్ నెంబర్ 94906-17346కు పంపించాలని సూచించారు. వాటితోపాటు టైం, డేట్, లొకేషన్ వంటి వివరాలను పంపించాలని కోరారు. ఇది మంచి పని అని పోలీసులను సామాన్యులు ప్రశంసిస్తున్నారు. ఈ నిర్ణయం రాష్ట్రమంతటా వర్తించేలా చూడాలని మరికొందరు కోరుతున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. రాంగ్ రూట్‌లో వెళ్లేవారి భరతం పట్టండి.. ప్రజల ప్రాణాల్ని కాపాడండి.

## ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీ

హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో యువతకు ఉపాధి కల్పించేలా తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రేవంత్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీలో వేయి ఎకరాల్లో ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ సిటీ (ఈ సిటీ)ని అభివృద్ధి చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 300 కోట్ల రూపాయిలను పెట్టుబడి పెట్టేందుకు అంగీకారం తెలిపిన టెలికాం ఉత్పత్తుల సంస్థలు సిరా నెట్ వర్క్స్(తైవాన్), ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్(తెలంగాణ) ప్రతినిధులతో శనివారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఎలక్ట్రానిక్ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమల ఏర్పాటులో పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈసిటీలో నెలకొల్పే పరిశ్రమ ద్వారా 2500 మంది యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇక్కడ 5జీ నెట్ వర్క్స్, మల్టీ లేయర్ నెట్వర్కింగ్ సొల్యూషన్స్, సర్వర్స్ తదితర టెలికాం ఉత్పత్తులను తయారు చేస్తారన్నారు. ఈ పెట్టుబడితో ఇండో తైవాన్ మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. టైర్ -2, టైర్ -3 నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలిచ్చి వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యయ్యేందుకు ముందుకొచ్చిన సిరా నెట్ వర్క్స్, ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## హైదరాబాద్ సిటీలో దంచికొట్టిన వాన

హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ సిటీలోని పలు ప్రాంతాల్లో వాన దంచికొడుతోంది. శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురిసింది. ఉప్పల్, చిలుకానగర్, కంటోన్మెంట్, బోడుప్పల్, మేడిపల్లి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. సికింద్రాబాద్, బేగంపేట పరిసర ప్రాంతాల్లో కుండపోతగా కురిసింది. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వాతావరణ శాఖ అంచనావేసినట్లుగానే తెలంగాణలో పలు జిల్లాల్లో వర్షం కురిసింది. కుమ్రం భీం జిల్లా కౌటాల మండలంలో ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. మరో రెండు గంటల్లో యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది.



# భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామిని దర్శించుకున్న దాస్యం దంపతులు



హనుమకొండ, మే 03 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంనందు శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని, వరంగల్ పశ్చిమ మాజీ శాసనసభ్యులు,మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, BRS హనుమకొండ జిల్లా అధ్యక్షులు, దాస్యం వినయ భాస్కర్ రేవతి దంపతులు దర్శించుకోని మొక్కులు సమర్పించువడం జరిగింది. ఈ సందర్భంగా దాస్యం వినయ భాస్కర్ మాట్లాడుతూ

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన, దక్షిణాది అయోధ్య గా పిలువబడే భద్రాచలం శ్రీ సీతారామచంద్రుల దేవాలయం, భక్తులు విశ్వాసం తో ఈ దేవుడిని వేడుకుంటారని, కోర్కెలు తీర్చే దేవుడిగా భద్రాద్రి రాముడికి పేరుంది అని అన్నారు. అలాగే గత ప్రభుత్వం కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో అనేక దేవాలయాలను అభివృద్ధి చేశారని, యాదాద్రి దేవాలయము ను ఒక గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దారని కొనియాడారు. జై శ్రీరాం అని చెప్పి కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చింది అని, కానీ ఉత్తరప్రదేశ్ లో ఉన్న అయోధ్యా రామాలయం పైన వున్న శ్రద్ధ మన భద్రాద్రి రాముడి పై చూపుతలేరని అన్నారు. భద్రాద్రి రాములవారి గుడి గురించి గత పార్లమెంట్ సమావేశాలలో BRS రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర భద్రాది అభివృద్ధి అంశంపై పార్లమెంట్ లో మాట్లాడారని, కేంద్రాన్ని నిలదీశారని అన్నారు. ఇప్పటికైనా భద్రాద్రి పై నరేంద్ర మోడీ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే 1000కోట్ల ప్యాకేజి ప్రకటించి భద్రాద్రి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు, ఓట్ల కోసం రాముల వారిని వాడుకోకుండా. చిత్తశుద్ధితో రాములవారి ఆలయాలను అభివృద్ధి చేయాలని అన్నారు. దాస్యం వినయ భాస్కర్ తో పాటు వరంగల్ పశ్చిమ BRS కో ఆర్డినేటర్ పులి రజిని కాంత్, BRS రాష్ట్ర నేత,మాజీ కార్పోరేటర్ జోరిక రమేష్, BRS నాయకులు బుద్దే వెంకన్న, మహేందర్ రెడ్డి, పోలపల్లి రామ్మూర్తి, కొక్కరకొండ అభిలాష్, రుద్రరాపు రాజు, సాయి భారత్,తదితరులు పాల్గొన్నారు

# వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో పెరిగిన ప్రసవాల సంఖ్య

## పెరిగిన నార్మల్ డెలివరీలు, తగ్గిన సిజేరియన్ సెక్షన్లు

## రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఫోకస్







భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 03 (తీన్మార్ న్యూస్): జిల్లా వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో ఉన్న వివిధ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులైన భద్రాచలం, చర్ల, అశ్వరావుపేట, మణుగూరు, బూర్గంపాడు, పాల్వంచ మరియు ఇల్లందులలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో స్పెషలిస్ట్ వైద్యుల కొరత తీవ్రంగా ఉండేది. రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులు మరియు ప్రజాప్రతినిధులు వివిధ సందర్భాలలో వైద్యుల కొరత పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కు సూచించగా, జిల్లా కలెక్టర్ అదనపు ప్రోత్సాహకాలు ప్రకటించి నోటిఫికేషన్ ఇవ్వవలసిందిగా డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబుని ఆదేశించారు. ప్రోత్సాహకాలతో కూడిన వేతనాలపై ఆకర్షితులైన వివిధ స్పెషలిస్ట్ డాక్టర్లను మారుమూల ప్రాంతాలైన వివిధ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో నియమించడం జరిగింది. స్థానికంగానే ప్రసూతి వైద్యులు, పిల్లల వైద్యులు, మత్తు మరియు రేడియాలజీ డాక్టర్లు అందుబాటులో ఉండటం, రోగులకు మంచి చికిత్స అందుతుండటంతో ప్రజలు సర్కారు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఎప్పటికప్పుడు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, అధికారుల సమన్వయం, జిల్లా కలెక్టర్ సహకారంతో మౌలిక సదుపాయాల ఏర్పాటు మరియు 24 గంటలు అందుబాటులో డాక్టర్లు మరియు వైద్య సిబ్బంది, అందుబాటులో ల్యాబ్ టెస్టులు, గర్భిణీ స్త్రీలకు చేసే ఎఎన్సి మరియు టిఫ్ఫా స్కాన్లు, అందుబాటులో ప్రసవానికి సంబంధించిన మందులు ప్రసూతి వార్డుల్లో ఏసీలు మరియు కూలర్లు ఏర్పాటు చేయడం అన్నీ కలగలిపి ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. మచ్చుకకు మణుగూరు ఆసుపత్రిలో ఫిబ్రవరి నెలలో కేవలం 8 డెలివరీలు కాగా, ఏప్రిల్ నెలలో 58 డెలివరీలు అవడం విశేషం. జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి నెలలో 300 ఉన్న ప్రసవాల సంఖ్య ఏప్రిల్ నెలలో 400 కు చేరింది. భవిష్యత్తులో కూడా పెరిగే అవకాశం ఉంది. విశేషమేమిటంటే ప్రభుత్వ ఆసుపత్రులలో కోత లేకుండా సుఖప్రసవాల సంఖ్య అధికంగా ఉంది. ప్రైవేటు ఆసుపత్రులతో పోలిస్తే సిజేరియన్ సెక్షన్ సంఖ్య ప్రభుత్వ ఆసుపత్రులలో చాలా తక్కువగా ఉంది. సాధారణంగా ప్రైవేటు ఆసుపత్రులలో ఒక కాన్పుకు సుమారు 30 నుండి 40 వేలు ఖర్చు అవుతుంది. ప్రభుత్వ ఆసుపత్రులలో అంకితభావంతో పని చేస్తున్న వైద్య సిబ్బంది, వసతులు మరియు సౌకర్యాలు పెరగడంతో ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ఆకర్షితులవుతున్నారు. తద్వారా పేద ప్రజలు తమ కాన్పుకి సంబంధించిన స్కానింగ్, రక్త పరీక్షలు, ఆపరేషన్, తదితర ఖర్చుల భారం తగ్గుతుందని, ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న మెరుగైన సేవల పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి సిబ్బంది సైతం తాము పనిచేస్తున్న ఆసుపత్రులలో కాన్పు చేయించుకోవడానికి మొగ్గు చూపుతున్నారు.

# ట్విట్టర్‌లో పిర్యాదు చేస్తే సస్పెండ్ చేస్తారా..?

మొదటి పేజీ తరువాయి

చేశారు. పడనివాళ్లు కూడా ట్విట్టర్ లో ఫిర్యాదు చేస్తారని అన్నారు. ఎండీకి ట్విట్టర్‌లో ఫిర్యాదు వచ్చిన వెంటనే అధికారులు న్యాయవిచారణ చేయకుండా సస్పెండ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవం తెలుసుకుని ఆ తరవాత చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్విట్టర్ లో కార్మికులు తమ సమస్యలు చెబితే మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. కార్మికులపై అధికారుల వేధింపులు, కక్ష సాధింపు చర్యలు, హేళనలకు ఫుల్ స్టాప్ పెట్టాలని హెచ్చరించారు. వారం రోజులు సజ్జన్నార్ కు సమయం ఇస్తున్నామని అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మరోసారి ఇలాంటివి రిపీట్ కాకుండా చూడాలని హెచ్చరించారు. లేదంటే ఊరుకునేది లేదని అన్నారు. ఇదిలా ఉంటే ట్విట్టర్‌లో సజ్జన్నార్ యాక్టివ్ గా ఉంటారన్న సంగతి తెలిసిందే. కండక్టర్‌లు, డ్రైవర్లు లేదా ఇతర సిబ్బందిపై ట్విట్టర్‌లో ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై కార్మికులు కొద్దిరోజులుగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# నీట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 03 (తీన్మార్ న్యూస్): నీట్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాలను ఎస్పి కిరణ్ ఖరేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో నీట్ పరీక్షల నిర్వహించనున్నట్లు తెలిపారు. డిగ్రీ కళాశాలలో 240 మంది, జూనియర్ కళాశాలల్లో 105 మంది మొత్తం 345 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులను రెండంచల నిశిత తనిఖీ తదుపరి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. విద్యుత్ అతరాయం లేకుండా నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. వేడి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలతో పాటు ఓ ఆర్ ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని అన్నారు. అత్యవసర సేవలకు గాను అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. అభ్యర్థులకు చల్లటి మంచినీరు అందించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో వ్యర్థాలు లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి సూచించారు. 4వ తేది మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహణ ఉంటుందని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను

అనుమతిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 1.30 నిమిషాల తర్వాత గేట్ మూసి వేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. నీట్ యు.జి. ప్రవేశ పరీక్ష నిర్వహణలో భాగంగా అభ్యర్థులు, సిబ్బంది పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్, ట్యాబ్లెట్, బ్లూటూత్, స్మార్ట్ వాచ్, ఇయర్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతి లేదని, షూస్, బెల్ట్, ఆభరణాలు ధరించవద్దని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కు అవకాశం లేకుండా పకడ్బందీగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీవీ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి పరీక్షను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని అన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డ్ ప్రింట్ తీసుకొని పరీక్ష కేంద్రాలకు రావాలని, అడ్మిట్ కార్డు లేకుండా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని, పరీక్ష హాల్ ఇన్విజిలేటర్ ఒక కాపీ అడ్మిట్ కార్డ్ కలెక్ట్ చేసుకుంటారని, అభ్యర్థులు రెండు కాపీలు తీసుకుని రావాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు ముందుగానే నీట్ ప్రవేశ పరీక్ష అడ్మిట్ కార్డ్ లను డౌన్ లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, పోస్ట్ కార్డు సైజు ఫోటో, ఫోటోతో కూడిన ఒరిజినల్ గుర్తింపు కార్డు (ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, రేషన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ ఫోటో) తప్పనిసరిగా వెంట తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్ష కేంద్రం గేట్ మూసివేస్తామని, గేటు మూసిన తర్వాత ఎవ్వరిని లోపలికి అనుమతించరని, అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకన్న,పర్యవేక్షక అధికారులు ఆర్ శ్రీధర్, బి.బాలు నాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మెపా డైరీ ఆవిష్కరణ



## స్థానిక ఎన్నికలే లక్ష్యంగా ముదిరాజ్లు ఐక్యతతో పని చేయాలి

## ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

## అచ్చునూరి కిషన్ ముదిరాజ్ మెపా జిల్లా అధ్యక్షుడు

## బండి రాజు ముదిరాజ్ మెపా జిల్లా గౌరవ అధ్యక్షులు

ములుగు, మే 03 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా కేంద్రంలోని మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) జిల్లా కార్యాలయంలో మెపా వ్యవస్థాపక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఆదేశాల మేరకు, మెపా ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు భూమ నరేష్ ముదిరాజ్ అధ్వర్యంలో ఘనంగా మెపా డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మెపా ములుగు జిల్లా అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షులు అచ్చునూరి కిషన్ ముదిరాజ్, బండి రాజు ముదిరాజ్ విచ్చేసి డైరీ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అచ్చునూరి కిషన్ ముదిరాజ్, బండి రాజు ముదిరాజ్ సంయుక్తంగా మాట్లాడుతూ మెపా అనేది విద్యా, ఉద్యోగ, సాధికారత కోసం స్థాపించమని, ఇందులో చేపలు పట్టే ప్రతి ముదిరాజ్ బిడ్డ, మరి ఏ ఇతర పనులు చేసే జాతి బిడ్డ లు, యువత అందరూ భాగస్వాములే అని తెలిపారు. అలాగే ముదిరాజ్ యువత, విద్యార్థుల సంక్షేమం కోసం మెపా ఎళ్ళవేళల పని చేస్తుందని, రాజ్యాధికారం కోసం జాతి బిడ్డలందరూ ఐక్యతతో పని చేయాలని, రానున్న స్థానిక ఎన్నికలే లక్ష్యంగా ముదిరాజ్'ల జెండా ప్రతి గ్రామంలో ఎగరాలని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ముదిరాజ్ లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మెపా ములుగు జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షులు బండి రాజు ముదిరాజ్, మత్స్య శాఖ జిల్లా అధ్యక్షుడు సాధు రఘు ముదిరాజ్, అబ్బాపూర్ మాజీ సర్పంచ్ గండి కూమార్ ముదిరాజ్, మెపా ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు భూమ నరేష్ ముదిరాజ్, మెపా వెంకటాపూర్ మండల అధ్యక్షుడు మేకల రమేష్ ముదిరాజ్, మెపా టీమ్ సభ్యులు కుక్కల కౌశిక్ ముదిరాజ్, శ్రావణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ అసిస్టెంట్ కార్యకర్తలు సమర్థవంతంగా పనిచేయాలి

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్




మహబూబాబాద్ జిల్లా, మే 03 (తీన్మార్ న్యూస్): ప్రస్తుతము ఉన్న వేసవి కాలము, రానున్న వర్షాకాలంలో క్షేత్రస్థాయిలో పనిచేసే హెల్త్ అసిస్టెంట్ మగ కార్యకర్తలు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ అన్నారు. శనివారం ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హెల్త్ అసిస్టెంట్ల సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు సూచనలు సలహాలను ఇవ్వాలని అంతేకాకుండా రానున్న వర్షాకాలంలో కీటక జనత వ్యాధుల నివారణ పట్ల కూడా హెల్త్ అసిస్టెంట్లు నిబద్ధతతో పనిచేసి కీటక జనిత వ్యాధుల ప్రబలకుండా చూడాలని ఆయన అన్నారు. అనంతరం జరిగిన మాతృ మరణాల రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాతృ మరణాలను తగ్గించాలని గర్భిణీ స్త్రీలను 12 వారాల లోపు నమోదు చేసి వారికి రక్తహీనత పరీక్షలను నిర్వహించి ఐరన్ ఫోలిక్ మాత్రలను ఇవ్వాలని సకాలంలో టీటీ ఇంజక్షన్లను, కనీసం ఒక్కసారి జిల్లా ఆసుపత్రిలోని గైనకాలజిస్టుకు చూపించి సాధారణ ప్రసవం జరిగేలా చూడాలని ముఖ్యంగా హై రిస్క్ ఉన్న గర్భిణీ స్త్రీలను గుర్తించి వారిని సకాలంలో ప్రసవానికి తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్. స్రవంతి , గూడూరు సివిల్ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ వీరన్న ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సారంగం డాక్టర్ సుధీర్ రెడ్డి డాక్టర్ లక్ష్మీనారాయణ డాక్టర్ నాగేశ్వరరావు మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు హెల్త్ అసిస్టెంట్లు సభ్యులు అధికారులు గోపి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎండ తీవ్రత కు గురికాకుండా జాగ్రతలు పాటిద్దాం

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి





మహబూబాబాద్ జిల్లా, మే 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో మరియు జిల్లాలో ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతున్న%శీ%దున వేసవి కాలంలో తీవ్రమైన ఎండ, వేడి గాలులు వీచినప్పుడు వడదెబ్బకు గురయ్యే అవకాశం కలదని ప్రజలందరూ తగిన జాగ్రతలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్. రవి రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

లక్షణాలు:లి వేసవికాలంలో వడ దెబ్బకు గురైనప్పుడు ముఖ్యంగా శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండి పోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం (తగ్గడం), మూత్రం గాఢ పసుపు రంగులో ఉండి మంట రావడం, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్ళే అన్ని లక్షణాలు గాని లేక కొన్ని లక్షణాలు గాని కనిపిస్తాయని పేర్కొన్నారు.

ప్రథమ చికిత్స: వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ గల ప్రదేశానికి చేర్చాలి, శరీరాన్ని చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి, ఎండ దెబ్బ తగిలిన వారికి ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, గ్లూకోజు, పప్పుకట్టు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని త్రాగించాలి, సత్వర చర్యల కొరకు 108 అత్యవసర సేవలను సంప్రదించాలి. ప్రథమ చికిత్స చేసిన తరువాత దగ్గరలో గల ఆరోగ్య కేంద్రం/ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని తెలిపారు.

జాగ్రత్తలు: వడ దెబ్బ తగలకుండా ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం/ఆడటం చేయరాదు, తప్పనిసరి పరిస్థితులలో ఎండలోకి వెళితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు తప్పక ధరించాలి, తెల్లని నూలు వస్త్రాలు ధరించాలి, నీరు మరియు ఇతర ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి, మత్తు పానీయాలు తీసుకోరాదు, ముఖ్యంగా ఇంటివద్ద వుండే పిల్లలు, 60 సం.ల. పై బడిన వారు, అనారోగ్యంతో బాధపడేవారు తరచుగా మంచినీరును మరియు ఓఆర్ఎస్ ను త్రాగలని, ఒకవేళ నోరు ఎండుకపోవడం, దాహం వేయడం లక్షణాలు వుంటే దగ్గరలోని ఆశా కార్య కర్తను సంప్రదించాలని తెలిపారు. అలాగే బయట పనికి వెళ్ళేవారు ఉదయం 12 గంటలలోపు మరియు సాయంత్రం 4 గంటల తదుపరి పనిచేసుకొవాలని మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవాలన్నారు.

గమనిక: ప్రతి ఆరోగ్య కేంద్రం, ఉప కేంద్రం, ఆశా కార్య కర్త వద్ద, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, గ్రామ పంచాయత్ లలో ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో కలవు కావున అవసరం ఉన్నవారు ఉపయోగించుకోగలరని పైన తెలిపిన జాగ్రత్తలు పాటిస్తూ వడ దెబ్బకు గురి కాకుండా చూసుకోవాలని తెలిపారు. అంతే కాకుండా వేసవి కాలంలో వచ్చే వ్యాధుల పై పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

# దేవాదుల ప్రాజెక్టును పూర్తి స్థాయిలో పూర్తి చేస్తాం

### రాష్ట్ర మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

### దేవాదుల పంపు హౌజ్ స్టేషన్ ను సందర్శించిన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి





హనుమకొండ జిల్లా, మే 03 (తీన్మార్ న్యూస్): దేవాదుల ప్రాజెక్ట్ కు సంబంధించిన అన్ని దశలను పూర్తిస్థాయిలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాగునీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట శివారులో ని దేవాదుల పంపు హౌజ్ స్టేషన్ ను రాష్ట్ర సాగునీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ, పాలకుర్తి, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కే ఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిడబ్ల్యూఎంసి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ నుండి నేరుగా దేవన్నపేటలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద మంత్రులు దిగగా ఎమ్మెల్యేలు, కలెక్టర్, తదితరులు పుష్పగుచ్ఛాలను అందజేశారు. దేవాదుల పంపు హౌజ్ స్టేషన్ చేరుకున్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి టన్నెల్ ను పరిశీలించారు. అనంతరం దేవాదుల పంపు హౌజ్ పనుల పురోగతి, ఇతర అంశాలపై సాగునీటిపారుదల శాఖ అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్ట్ అన్ని దశలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే దేవాదుల పంప్ హౌస్ ను సందర్శించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి సాగునీరు, ధాన్యం కొనుగోలు, తదితర అంశాలపై సమీక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు పేర్కొన్నారు. దేవాదుల మూడు పైపు లైన్ల పంపులను ఆన్ చేసి సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేవాదుల పంప్ హౌస్ నుండి ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద ఉన్న దేవాదుల పైపులను మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా సాగునీటిపారుదల శాఖ ఈఎన్సి అనిల్ కుమార్, సీఈ అశోక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భద్రకాళి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రులు పొంగులేటి, ఉత్తం



వరంగల్, మే 03 (తీన్మార్ న్యూస్): శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈ రోజుతో ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించిన తదుపరి చతు: స్థానార్చన జరిపి ఉదయం అమ్మవారిని సూర్యప్రభ వాహనంపైన సాయంకాలం హంస వాహనంపైన ఊరేగింపు జరిపారు. "జయచంద్ర దివాకరనేత్రధరే" అని శాస్త్రాలు అమ్మవారిని స్తుతిస్తున్నాయి. సూర్యచంద్రులను అమ్మవారు నేత్రములుగా కలిగి ఉన్నదని దీని అర్థం. ప్రకాశానికి ప్రతీక సూర్యుడు. "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" అని పురాణాలు చెబుతున్నాయి. సూర్యప్రభ వాహనంమీద సేవింప బడుతున్న అమ్మవారిని దర్శించిన భక్తుల జీవితం దేదీప్యమానంగా ఉ ంటుంది. మంచి ఆరోగ్యం, కీర్తి ప్రతిష్టలు కలుగుతాయి, నేత్రరోగాలు పోతాయి, అంతర్ దృష్టి, బాహ్యదృష్టి బాగా పనిచేస్తాయి. హంస జ్ఞానానికి ప్రతీక, పాలలోని నీళ్ళను వదిలేసి కేవలం పాలు మాత్రమే స్వీకరిస్తుంది హంస, దీన్నే క్షీరనీర న్యాయం అంటారు. హంస వాహనం మీద ఊరేగింపబడుతున్న అమ్మవారిని సేవించిన వారికి విచక్షణా జ్ఞానం బాగా పెరుగుతుంది. తద్వారా ధర్మాధర్మ విచక్షణ కలిగి సమాజ హితముగా ప్రవర్తిస్తారని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. సూర్యచంద్రులు దివారాత్రములకు అధిపతులు. సూర్యుడు జగత్తుకు వెలుగు ప్రసాదిస్తూ అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న జీవులను తరింపజేస్తాడు. పగలంతా తమ విధ్యుక్త ధర్మ నిర్వహణలో అలసియున్న జీవులకు చంద్రుని వెన్నెల చల్లదనం స్వాంతన చేకూరుస్తూ గాఢ నిద్రను అందించడమేగాక అలసట నివారించి శక్తిమంతులను జేస్తుంది. ఆ దివారాత్రములకు అధిపతులైన సూర్యచంద్రులను నేత్రములుగా ధరించి సకల ప్రాణుల జీవన వ్యవహారాలను నియంత్రిస్తుంది. జగన్మాత. ఈ రోజు కార్యక్రమాలకు ఉభయదాతలుగా వరంగల్ జిల్లా సగర (ఉప్పర) సంక్షేమ సంఘం వారు వ్యవహరించారు. ఈ రోజు బ్రహ్మోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎం.ఎల్.ఏ శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి విచ్చేశారు. పూజానంతరం ఎం.ఎల్.ఏ శ్రీ రాజేందర్ రెడ్డి గారికి మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించారు. ఈ రోజు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సగరకుల ప్రముఖులలో సీత కమలాకర్రావు, గూజ్జారి అరుణ్కుమార్, వడ్లకొండ కుమారస్వామి, కొల్లూరు మధుకర్, సీత దుర్గాప్రసాద్, నలుబోలు శంకర్, తైలం వేణుగోపాలస్వామి, మంగనూరి బాబూరావు, రఘు, తాడిశెట్టి విద్యాసాగర్, గుంటి శ్రీను, వీరగంటి రవీందర్, నెక్కొండ కిషన్, గాండ్ల స్రవంతి, గుంటి స్వప్న, సీత శ్యామల, కురిమిండ్ల రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు. సాయంకాలం హనుమకొండ జిల్లాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించడానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రులు ఉత్తమ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఈ రోజు ఆలయానికి విచ్చేసి బ్రహ్మోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్నారు. వీరి వెంట వరంగల్ ఎం.ఎల్.ఏ శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎం.ఎల్.ఏ కె.ఆర్. నాగరాజు, పాలకుర్తి ఎం.ఎల్.ఏ యశస్వినీ రెడ్డి, డోర్నకల్ ఎం.ఎల్.ఏ రాంచంద్రనాయక్, స్టేషన్ ఘనపూర్ ఎం.ఎల్.ఏ కడియం శ్రీహరి, కుడా చైర్మన్ ఇసుగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, ఐ.ఏ.ఎస్. వరంగల్ కలెక్టరు సత్యశారదా దేవి, ఐ.ఏ.ఎస్, మున్సిపల్ కమీషనర్ అశ్వినీ తానాజీ వాకడే తదితరులున్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు ఆలయ ఈ. ఓ శేషుభారతి, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. పూజానంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు ఇరిగేషన్ అధికారులను చెరువు పూడికతీత పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు మరియు మాడవీధులు పురోగతిని పరిశీలించి తమ హర్షం వ్యక్తం చేశారు.



# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం వనపర్తి ఎస్పీ





## అమ్మపల్లె గ్రామంలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవం

పెద్దమందడి, మే 03 (తీన్మార్ న్యూస్) నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు. శనివారం అమ్మపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసుల కంటే ఎక్కువగా పనిచేస్తుంది, అని చెప్పారు.

గ్రామాభివృద్ధిలో భాగంగా మొత్తం 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా, వీటిని గ్రామస్తుడు జగదీశ్వర్ రెడ్డి సహకారంతో ఏర్పాటుచేశారు. ఆయనను జిల్లా ఎస్పీ శాలువాతో సత్కరించారు. నేరాల నివారణ కోసం ప్రతి దుకాణం, వాణిజ్య సముదాయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఎస్పీ గిరిధర్ మాట్లాడుతూ, సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలు జరిగిన వెంటనే గుర్తించవచ్చు. వ్యాపారులు, ప్రజలు తప్పనిసరిగా సీసీ కెమెరాలు పెట్టుకోవాలి. ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించి, మత్తు పదార్థాలపై జాగ్రత్తలు తీసుకోవాలి, అని చెప్పారు.

అయితే ఎలాంటి ఆపదలోనైనా ప్రజలు 100 నంబర్‌కు కాల్ చేస్తే తక్షణమే పోలీసులు స్పందిస్తారని ఆయన హామీ ఇచ్చారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూడా సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, కొత్తకోట సీఐ రాంబాబు, పీఎస్ఐ దివ్య, మాజీ సర్పంచ్ బోయినీ రమేష్, గ్రామ ప్రముఖులు అర్జున్, బాలు తదితరులు పాల్గొన్నారు. పెద్దమందడి ఎస్సై ఈ.శివకుమార్ మాట్లాడుతూ, మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పోలీసులు, ప్రజలు కలసి పనిచేయాలని కోరారు. ఇలాంటి చర్యల ద్వారా గ్రామాల్లో శాంతిభద్రతలు మెరుగవుతాయని, అసాంఘిక కార్యకలాపాలను సమర్థంగా ఎదుర్కోవచ్చని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి సంక్షేమ ఫలాలు పేదోడికి అందించడమే దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ లక్ష్యం

### దశాబ్దాల కలను నెరవేర్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు ధన్యవాదాలు - తండావాసులు.



దేవరకద్ర ప్రతినిధి,మే03(తీన్మార్ న్యూస్) : ప్రజల ప్రతి అవసరాన్ని తీర్చడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అభివృద్ధి,సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్క పేద ప్రజలకు అందించేలా చూస్తానని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు.వనపర్తి జిల్లా మదనాపురం మండలం నెల్విడి గ్రామం నుండి నెల్విడి తాండ వరకు వేసిన నూతన బీటీ రోడ్డును ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి.ఈ సందర్భంగా దశాబ్దాల కలను నెరవేర్చిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ కు ధన్యవాదాలు తెలియజేసిన గ్రామ ప్రజలు,తండావాసులు.ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మారుమూల గ్రామాలు,పంచాయితీలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ప్రజా ప్రతినిధులు,అధికారులు సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ప్రజా ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు,తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్స్ కార్మికులకు యూనిఫార్మ్స్ పంపిణి చేసిన మ్మెల్యే నాయిని




హనుమకొండ, మే 03 (తీన్మార్ న్యూస్): ప్రజా భవన్ (ఎం.ఎల్.ఏ.) క్యాంపు ఆఫీస్ లోఈ రోజు హన్మకొండ జిల్లా మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ కీతిడి దీపక్ రెడ్డి ఆధ్వర్యం లో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ కాకతీయ ఆటో యూనియన్ ఆటో డ్రైవర్లకు యూనిఫార్మ్స్ పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో కాకతీయ ఆటో యూనియన్ నుండి దేవేందర్ రెడ్డి , రైకంటి రఘు ,అంకుష్ అలీ ,కుమార్ సయెద్ ఘోస్, ఆనంద్ పాల్గొన్నారు.

## ఎక్సయిస్ దాడుల్లో 35లీ. గుడుంబా 800లీ. పానకం, ఒక బైక్ స్వాధీనం





పరకాల, మే 03 (తీన్మార్ న్యూస్): పరకాల ఎక్సయిస్ స్టేషన్ పరిధిలోని నడికుడ మండలం కౌకొండలో దాడులు నిర్వహించి గుడుంబా తయారు చేస్తున్న సున్నపు రాజేందర్ ను అరెస్ట్ చేసి అతడి ఇంటివద్ద నుండి గుడుంబా తయారీ కై నిల్వ ఉంచిన (800)లీటర్ల చక్కెర పానకం ను ధ్వంసం చేసి (20) లీటర్ల గుడుంబా ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. దీనితోపాటు పరకాల శివారులో రూట్ వాచ్ నిర్వహించి రేగొండ మండలం రామన్నగూడెం నుండి పరకాల కు గుడుంబా రవాణా చేస్తున్న బైక్, (15) లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోవడం జరిగింది. పారిపోయిన ముద్దాయి ఆజిమిరా శివ %ం/శీ% బధ్రు పై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ దాడులలో సీఐ పి. తాతాజీ, ఎస్ఐలు సులోచన, జ్యోతి, సిబ్బంది లక్ష్మణ చారి, సమ్మయ్య, విజయకుమార్, దిలీప్, సత్తయ్య లు పాల్గొన్నారు.

## నియామక పత్రాల అందజేత






జనగామ జిల్లా, మే 03 (తీన్మార్ న్యూస్): జాతీయ ఆరోగ్య మిషన్ లో అర్హత సాధించి వివిధ కేటగిరీలలో ఎంపికైన (33) మందిలో (26) మంది నర్సింగ్ ఆఫీసర్స్ కు ఈ రోజు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖా కార్యాలయములో కలెక్టర్ ఆదేశాల మేరకు నియామక పత్రాలు డా.కె.మల్లిఖార్జున్ రావు, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి చేతుల మీదుగా అందజేయడం జరిగినది. మిగిలిన కేటగిరీలకు ఎంపికైన వారికి అవుట్ సోర్సింగ్ ఏజన్సీ ద్వారా నియామక పత్రాలు అందించుటకు ఏర్పాట్లు చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లా కు మంచి పేరు తేవాలని, పేద రోగుల పట్ల ఆప్యాయతతో మెలిగి, వారి మన్నన పొందాలని, సకాలములో విధులకు హాజరై, జిల్లా యొక్క నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడం లో పూర్తీ లక్ష్యం తో సహకారం అందించాలని, వ్యక్తిగతంగా మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గౌరవ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష, ఐ.ఏ.యస్. మరియు అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్, ఐ.ఏ.యస్. లు అభ్యర్థులందరికీ అభినందనలను తెలియ జేయడం జరిగింది. జిల్లా కు మంచి పేరు తేవాలని అన్ని లక్ష్యాలు సాధించడం లో పూర్తీ భాధ్యతాయుతంగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమములో డా.అశోక్ కుమార్ ప్రోగ్రాం ఆఫీసర్ మరియు కార్యాలయ సూపరిండెంట్ హేమ నాయక్ లు పాల్గొన్నారు.



# మద్యం నియంత్రణతోనే నేరాలకు అడ్డుకట్ట!

భారీగా మద్యం అమ్మకాలు సాగాలన్నదే ప్రభుత్వాల లక్ష్యంగా ఉంది. మద్యంతో ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో ప్రభుత్వాలు గమనించడం లేదు. మద్యం ఆదాయంతో కిలో రూపయి బియ్యం, పెన్షన్లు ఇవ్వడానికి, ఉచిత పథకాలకు ప్రభుత్వాలు అలవాటు పడ్డాయి. అందుకే మద్యనిషేధాన్ని అమలు చేయడం లేదు. తాగి చచ్చినా ఫర్వాలేదు... మద్యం అమ్మకాలు సాగాలి.. ఆదాయం పెరగాలన్న ధోరణిలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలు ఇందుకు భిన్నంగా లేవు. నిజానికి ఉచిత పథకాలు ఆపితే మద్యం అమ్మకాల వైపుచూడాల్సి రాదు. తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలపై అదుపు లేకుండా పోతోంది. మద్యం ధరలు పెంచినా అమ్మకాలు ఆగడం లేదు. మద్యం ప్రధాన ఆదాయ వనరు కావడంతో తెలుగు రాష్ట్రాల్లో అమ్మకాలపై అజమాయిషీ లేకుండా పోతోంది. బ్రాండ్ ఏదైనా డబ్బులు తెచ్చి పెడుతోంది. మద్యం, గంజాయి వంటివి అందుబాటులో ఉండడంతో జులాయిలు అకృత్యాలకు తెగబడుతున్నారు. మత్తులో ఉన్న వారిలో దూకుడు స్వభావం, విపరీత ధోరణి ఉంటుంది. ఇదే నేరాలకు దారి తీస్తోంది. విపరీత ప్రవర్తన, సమాజంపై ద్వేష భావం ఉండేవారికి మద్యం మత్తు తోడైతే అది తీవ్రమైన నేరాలకు కారణమవుతుంది. అందువల్ల మద్యం,గంజాయి లభ్యం కాకుండా అరికట్టే మార్గాలు ఆలోచించాలి. అకృత్యాల కట్టడికి ఏం చేయాలన్నది చర్చించాలి. మహిళలపై లైంగిక నేరాలు, అత్యాచారాలకు పాల్పడుతున్న వారిలో మద్యం మత్తులో ఉన్నవారెందరన్నది గణాంకాలు తీయాలి. అలాగే ఎక్కడపడితే అక్కడ మద్యం లభిస్తోంది. దీనికి తోడు గంజాయి లభ్యత కూడా పెరిగింది. చెడు సావాసాలతో మత్తులో మునిగి నేరాలకు పాల్పడుతున్నారు. దీనికంతటకీ నిరుద్యోగం, పనులు లేకపోవడం కూడా కారణంగా చూడాలి. ఇవన్నీ అరికట్టేందుకు ఏం చూయాలో ఆలోచించి ముందుకు కదిలితేనే నేరాలను అరికట్టగలం. ఇటీవల గంజాయి కూడా విపరీతంగా పట్టుబడుతోంది. ఎంతగా స్వాధీనం చేసుకున్నా రవాణా ఆగడం లేదు. దీనికి కారణం మార్కెట్లో డిమాండ్ కారణంగా గంజాయి పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎపితో పోలిస్తే తెలంగాణలో మద్యం అమ్మకాలు పెరిగాయి. మద్యం అమ్మకాలతో పాటు నేరాలు, ఘోరాలు కూడా పెరుగుతున్నాయి. మద్యం మత్తులోనే నేరాలు జరుగుతున్నట్లు పోలీసులు కూడా అంగీకరిస్తున్నారు. అత్యాచారలు, దొంగతనాలు, కిడ్నాప్‌లు ఇలా అనేక రకాలైన నేరాలకు మద్యం కారణం అవుతోంది. సంపూర్ణ మద్యనిషేధం విధిస్తామని అధికారంలోకి వచ్చినప్పుడు నాటి సిఎం జగన్ హామీ ఇచ్చి డొల్ల కంపెనీల బ్రాండ్లతో వేలకోట్లు సంపాదించారు. మద్యం కుంభకోణంపై ఇప్పుడు సిట్ విచారణ సాగుతోంది. మద్యం అమ్మకాలు లేకపోతే ప్రభుత్వం నడిచే పరిస్థితిలో లేదు. దీంతో మద్యం అమ్మకాలను బాహాటంగానే ప్రోత్సహిస్తున్నారు. ఇష్టం వచ్చిన బ్రాండ్లతో అమ్మకాలు చేసి ఖజానా నింపుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడా..ఇక్కడా అన్న తేడా లేకుండా నేరాలు పెరుగుతున్నాయి. అంతెందుకు పార్టీ కార్యకర్తలకు మందు లేనిదే కాలు బయట పెట్టడం లేదు. పార్టీ ఏదైనా.. కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనాల్లో మద్యంతోపాటు ముక్క లేనిదే కదలడం లేదు. అత్యాచార ఘటనల్లో అనేకం కేవలం మద్యం కారణంగానే జరిగినట్లుగా గుర్తించారు. రేపిస్టులకు కఠిన శిక్షలు పడితే ఇలాంటి దారుణాలు చోటుచేసుకోవు. ప్రభుత్వం తాము కఠినంగా ఉన్నామని అనుకుంటే సరిపోదు. కఠినంగా ఉంటున్నారన్న సందేశం ప్రజల్లోకి వెళ్లగలిగేలా చేయాలి. అప్పుడే ఇలాంటి ఘటనలు జరగవు. అలా చేయాలనుకున్న వారు కూడా జంకుతారు. అక్రమాలు, అకృత్యాలపై ప్రభుత్వాలు ఉదాసీనంగా ఉండడం వల్లనే దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. అవి ఒక్క ఎపిలోనే జరుగు తున్నాయని చెప్పడానికి లేదు. తెలంగాణతో పాటు ఘనత వహించిన యూపిలో కూడా జరుగుతూనే ఉన్నాయి. గొప్పలుచెప్పుకుంటున్న కమ్యూనిస్టుల ఏలుబడిలో ఉన్న కేరళలోనూ జరుగుతున్నాయి. రాక్షసులకు ప్రాంతం ఏదన్నది ముఖ్యం కాదు. రాక్షస ప్రవృత్తి ఉన్నవారు ప్రపంచమంతా నిండి ఉన్నారు. అలాంటి వారికి మద్యం తోడవుతోంది. వారికి కఠిన శిక్షలు అమలు చేయాల్సి ఉంది. ఏదైనా అరాచక సంఘటన జరిగినప్పుడు ఉమ్మడిగా ఎలా ముందుకు వెళ్లాలన్న ఆలోచనచేయాలి. ఇకపోతే ఇటీవల చోటు చేసుకుంటున్న సామూహిక అత్యాచార ఘటనలను చూస్తే సామాన్యలకు కూడా భయమేస్తోంది. బయటకు రావాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఉంది. చిన్నపిల్లలను కూడా వదలడం లేదు. కొన్ని సందర్భాల్లో న్యాయస్థానాలు కఠిన శిక్షలు విధించి కొంత ఊరటను కలిగిస్తున్నాయి. ఇలాంటి ఘటనలన్నింటికి మద్యపానం, మాదక ద్రవ్యాల వాడకం అన్నది ప్రధాన కారణమవుతోంది. పోలీసలు దర్యాప్తుల్లో ఇదే తేలుతోంది. మద్యం మత్తులో ఉండే వ్యక్తికి అదే మైకంలో ఉన్న మరో ఇద్దరు, ముగ్గురు తోడైతే వారి పశుత్వానికి అడ్డూ అదుపు ఉండదు. అలాంటి సందర్భాల్లో వారికి నిస్సహాయంగా, ఎదురించలేని స్థితిలో మహిళలు ఎవరైనా కనిపిస్తే అఘాయిత్యానికి తెగబడతారు. తాను ఒక్కడినే కాదని.. తనతో పాటు మరి కొందరు ఉన్నారన్న భరోసాతో మరింతగా రెచ్చి పోతారు. తమవల్ల వారికి ఏమవుతుందో అన్న భయం కానీ..తరవాత తామేవుతామో అన్న ఆలోచనకానీ ఆ సమయంలో ఉండదు. అందువల్ల యువతకు పని కల్పించడం, ఖాళీగా లేకుండా చూడడం, మద్యంపై నియంత్రణ విధించడం అవసరం అని పాలకులు గుర్తించాలి.

# పాక్‌పై భారత్ మరో ఆర్థిక దాడి




**న్యూఢిల్లీ, మే 3 :** దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని, పాకిస్థాన్‌పై ఆర్థికంగా ఒత్తిడి తెచ్చేందుకు భారత ప్రభుత్వం పాక్ దిగుమతులపై నిషేధం విధించింది. ఈ నిషేధం విదేశీ వాణిజ్య విధానం 2023లో భాగంగా కొత్త నిబంధనగా చేర్చబడింది. దీనిలో భాగంగా, పాకిస్థాన్ నుంచి ఉత్పత్తులు దిగుమతి చేసుకునే లైసెన్సులను రద్దు చేయడం, ఎలాంటి సరుకుల ప్రవేశానికి అనుమతి ఇవ్వకపోవడం వంటి చర్యలు తీసుకున్నారు. ఈ నిషేధంతో పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం పడే అవకాశముంది. భారత ప్రభుత్వం ఈ చర్యను అంతర్జాతీయ వేదికలపై కూడా న్యాయబద్ధంగా నిలబెట్టే ప్రయత్నం చేయనుంది. ఉగ్రవాదంపై సోరులో ఇది ఒకటని తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్–పాకిస్థాన్ సంబంధాలు మరింత దిగజారాయి. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం పాకిస్థాన్ నుంచి అన్ని రకాల దిగుమతులపై నిషేధం విధించింది. జాతీయ భద్రత, ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిషేధం వెంటనే అమలులోకి వచ్చింది. రవాణాలో ఉన్న వస్తువులతో సహా పాకిస్థాన్ నుంచి వచ్చే లేదా ఆ దేశం నుంచి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులపై వర్తిస్తుంది. ఈ క్రమంలో పాకిస్థాన్‌లో లేదా అక్కడి నుంచి ఎగుమతి చేయబడిన అన్ని వస్తువుల దిగుమతి లేదా రవాణా అన్నీ కూడా వెంటనే నిషేధించబడతాయి. ఈ నిషేధానికి మినహాయింపు కోసం భారత ప్రభుత్వం ముందస్తు అనుమతి అవసరమని వాణిజ్య మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో దాయాదితో అన్ని రకాల దౌత్య సంబంధాలు తెంచుకుంటోన్న భారత్ ఇలా మరో గట్టి షాకిచ్చింది. దేశ భద్రత, ప్రజా విధాన ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. పాకిస్థాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది. పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయ్యే లేదా ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే అన్నిరకాలా వస్తువుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తున్నాం. అనుమతులు ఉన్న ఉత్పత్తులైనా, స్వేచ్ఛాయుత దిగుమతులైనా సరే పాక్ నుంచి ఎలాంటి వస్తువులను అనుమతించబోం. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయి. ఈ నిషేధం నుంచి ఏవైనా మినహాయింపులు కావాలంటే.. భారత ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరని వాణిజ్య మంత్రిత్వ శాఖ తమ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. భారత్–పాకిస్థాన్ మధ్య వాణిజ్యానికి ఉన్న ఏకైక రవాణా మార్గం అటారీ–వాఘా సరిహద్దు. ఇప్పటికే దాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. ఇక, 2019లో పుల్వామా దాడి తర్వాత నుంచి దాయాది నుంచి మనం చాలావరకు దిగుమతులు తగ్గించుకున్నాం. పాక్ ఉత్పత్తులపై కేంద్రం 200శాతం సుంకం విధించింది. కొన్ని రకాల ఫార్మా ఉత్పత్తులు, పండ్లు, నూనెగింజల వంటి వాటిని మాత్రమే దాయాది నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. పాక్‌లోని కొన్ని పరిశ్రమలు భారత్‌కు చేసే ఎగుమతులపైనే ఆర్థికంగా ఆధారపడుతున్నాయి. ఆర్గానిక్ కెమికల్స్, ఎ÷–లాస్టిక్స్, విలువైన లోహ సమ్మేళనాలు, మినరల్ ఫ్యుయల్స్, నూనె ఉత్పత్తులు, కొన్ని రకాల పిండి పదార్థాలు, బంక, ఎంజైమ్స్, వర్ణ ద్రవ్యాలు, మసాలా దినుసులు వంటివి దిగుమతి చేసుకునే వస్తువుల్లో ఉన్నాయి. ఇప్పుడు భారత్ వాటిపై నిషేధం విధించడంతో పాక్‌లో ఆయా రంగాల పరిశ్రమలు కుదేలయ్యే అవకాశం ఉంది. మరోవైపు, పాకిస్తాన్‌తో సముద్ర రవాణా మార్గాలను భారత్ మూసివేసింది. ఆ దేశ జెండాతో ఉన్న ఓడలు భారత పోర్టుల్లోకి రాకుండా కేంద్రం నిషేధం విధించింది. భారత ఓడలు కూడా పాక్ పోర్టుల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేసింది. ఇప్పటికే పాక్ విమానాలకు మన గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే.

# తెలంగాణలో మూడ్రోజులు వర్షాలు


## పలు జిల్లాలకు వాతావరణశాఖ హెచ్చరిక



**హైదరాబాద్, మే 3:** తెలంగాణలో వాతావరణం ఒక్కోలా మారిపోతుంది. అప్పటి వరకు వేడి గాలులు, ఎండవేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు సాయంత్రం కాగానే చల్లటి వాతావరణం ఉపశమనాన్ని ఇస్తోంది. అంతేకాకుండా ఉన్నట్టుండి వర్షాలు కూడా పడుతున్నాయి. ఉదయం ఎండగా ఉంటూ.. సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రజలకు ఊరట కలిగిస్తోంది. ఇదిలా ఉండగా.. తెలంగాణలో వర్షాలపై వాతావరణ శాఖ కీలక ప్రకటనచేసింది. పలు జిల్లాల్లో భారీ వర్షాలు ముంచెత్త నున్నట్లుపేర్కొంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు– భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉదయం పూట ఎండలు దంచికొట్టినప్పటికీ సాయంత్రం వేళల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని.. ఈదురుగాలులతో కూడిన వర్షం పడనున్నట్లు– వెదర్ రిపోర్ట్ చెబుతోంది. రాష్ట్రంలో ఏయే జిల్లాలో వర్షాలు పడతాయనే విషయాన్ని కూడా వాతావరణ వాఖ ప్రకటించింది. ముఖ్యంగా ఖమ్మం, మహబూబాబాద్ నల్లగొండ, వరంగల్, జనగాం, సూర్యాపేట, కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఎక్కువగా ఉంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమంగా ఉండగాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలకు రైతులు అల్లాడిపోతున్నారు. ఇటీ–వల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షం కురవగా.. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి రాకముందే వర్షానికి దెబ్బతినడంతో రైతులు బాధ వర్ణణాతీతమనే చెప్పుకోవాలి. ఈదురుగాలలు, ఉరుములు, మెరుపులతో పాటు– వడగళ్ల వర్షంతో పంటలకు అపారనష్టం వాటిల్లింది.

# పెరుగుతున్న నిత్యావసర ధరలు

## చోద్యం చూస్తున్న ప్రభుత్వాలు



న్యూఢిల్లీ, మే 3: అడ్డూ అదుపు లేకుండా పెరుగుతన్న నిత్యావసరాల ధరలు సామాన్య,మధ్య తరగతి ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. ఉప్పు, పప్పు, నూనె, పెట్రోల్.. ఇలా అన్నింటి ధరలు అందనంతగా పెరిగిపోతున్నాయి. వీటికి తోడు మందుల ధరలు కూడా సైలెంట్‌గా పెంచేశారు. ఇప్పుడు సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ధరలు మరింతగా పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. వ్యాపారులు కూడా సమయం చూసి ధరలు పెంచేస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ధరలు దాడి చేస్తున్నాయి. పెట్రో ధరలతో అన్నిరకాల వస్తువుల ధరలు దాదాపు రెండింతలు అయ్యాయి. చాయ్ సింగిల్ కనీసం 15 రూపాయలుగా అమ్ముతున్నారు. మూడేళ్లలో నెలసరి ఇంటి ఖర్చులు ఏకంగా 5 వేలు దాటేశాయి. ఈ ధరాఘాతంతో బతకలేక సామాన్యులు బెంబేలెత్తి పోతున్నారు. ఈ ధరలకు తోడు కరెంటు బిల్లులు, పెట్రోల్ బాదుడు కూడా అదనంగా వచ్చి చేరింది. ప్రభుత్వాలు ధరలను అరికట్టే చర్యలకు పూనుకోవడం లేదు. ధరలు పెరగడం సహజం అన్న ధోరణిలో ఉన్నారు. తమకు అందుబాటులో ఉన్న పెట్రోల్, గ్యాస్, విద్యుత్ తదితర వస్తువులపై వడ్డింపులు వేస్తూనే ఉన్నారు. దీనికితోడు జిఎస్టీ వడ్డింపులు శరాఘతంగా మారాయి. సామాన్యులు బతకడం దుర్లభంగా మారింది. ధరల పెరుగుదలను తలచుకుంటేనే మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి ఖర్చు సగటున నెలకు రూ.5వేలకు పైగా పెరిగింది. ప్రతి ఒక్కరిపైనా ఏటా 5 నుంచి 10 శాతం పెంపుతో అదనపు భారం తప్పదు. పంటలు దెబ్బతిని గ్రామాల్లో ఉపాధి కరవైంది. అటు పనుల్లేక, ఇటు ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. కందిపప్పు, మినపప్పు, పెసరపప్పుల ధరల్లో పెరుగుదల అధికంగా ఉంది. కరోనా సమయంలో ధరలు భారీగానే పెరిగినా తర్వాత కాస్త నెమ్మదించాయి. కొంతకాలంగా నిలకడగా సాగుతున్నాయి. గతంలో 3 నెలలకు రూ.333 ఉండే రీఛార్జ్.. ఇప్పుడు రూ.666కు చేరింది. దీనికి తోడు వై–ఫై రూపంలో నెలకు రూ.500 వరకు అదనపు భారం తప్పట్లేదు. కేబుల్ టీవీ ఖర్చు రూ.250 వరకు అదనం. ఒక్కో ఓటీటీ ఛానెల్‌కు సగటున రూ.500 చొప్పున నాలుగు తీసుకున్నా.. రూ.2 వేలు. అంటే నెలకు రూ.166 చొప్పున ఖర్చవుతుంది. ఒక్కో కుటుంబంపైనా మొబైల్, కేబుల్ బిల్లుల రూపంలోనే నెలకు రూ.2వేల వరకు అవుతోంది. వై–ఫై, ఓటీటీ తీసుకున్న కుటుంబాలకు నెలకు రూ.1,000 చొప్పున తప్పట్లేదు. 2019 మధ్యలో వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.600 వరకు ఉంది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.950అయింది. అప్పటితో పోలిస్తే రాయితీ కూడా తగ్గిపోయింది. రూ.15 చొప్పునే నామమాత్రంగా ఇస్తున్నారు. నెలకు ఒక సిలిండర్ లెక్కన చూస్తే.. ఒక్కో కుటుంబంపై రూ.372 చొప్పున భారం పడుతోంది. ఇక పెట్రోల్, డీజిల్ ధరల గురించైతే చెప్పనక్కర్లేదు. చిరు వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులకు ద్విచక్రవాహనం భారమైపోయింది. నెలకు సగటున 25 లీటర్ల పెట్రోల్ లెక్కన చూసినా రూ.1,100 వరకు ఖర్చు పెరిగింది. 2019లో రూ.75లోపు ఉన్న పెట్రోల్ ధర.. ప్రస్తుతం రూ.121 వరకు చేరింది. లీటరుకు రూ.45కు పైగానే పెరిగింది. ఇంజిన్ ఆయిల్ ధర రూ.300 నుంచి రూ.500కు చేరింది. ఇప్పుడు రష్యా–ఉక్రెయిన్ యుద్ధంతో మరింత ఎగిశాయి. బ్రాండెడ్ టీపొడి ధర గతంలో కిలో రూ.540 ఉండేది. ప్రస్తుతం రూ.780 చొప్పున విక్రయిస్తున్నారు. అల్లం, యాలకులు, తులసి, అశ్వగంధ వంటి ఉత్పత్తులతో తయారయ్యే ఒక సంస్థ టీ పొడి.. 2019లో రూ.380 ఉండేది. ప్రస్తుతం రూ.560కి చేరింది. లీటర్ పాల ధర గతంలో రూ.55 నుంచి రూ.58 మధ్య ఉండేది. ఇప్పుడు సగటున రూ.64 నుంచి రూ.68 వరకు ఉంది. నెలకు 30 లీటర్లకు రూ.300 అదనంగా ఖర్చవుతోంది. సబ్బులు, డిటర్జెంట్ ఉత్పత్తుల ధరలూ.. 30 శాతం వరకు పెరిగినట్లు అంచనా. వీటికి తోడు ఇంట్లో వాడే ఒంటి సబ్బులు,ఫేస్‌క్రీమ్, షాంపూ ధరలూ రెట్టింపయ్యాయి. పాత్రలు కడిగే సబ్బు ధర మూడేళ్ల కిందట రూ.45 ఉంటే ఇప్పుడు అది 51 శాతం పెరిగి.. రూ.68కి చేరింది. టూత్‌పేస్ట్ ధర 2019లో రూ.79 ఉంటే.. ఇప్పుడు రూ.96 రూపాయలకు పైగానే ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రకాల వస్తువులపైనా ధరలు పెరిగాయి. ఉల్లిపాయల ధరలు 25కిలో దగ్గర స్థిరంగా ఉన్నాయి. అయితే ఇవన్నీ కూడా తగ్గింప ప్రయత్నాలు చేయడం లేదు.

# వర్షాలతో కల్లాల్లోనే తడిసిన ధాన్యం

## పలుచోట్ల నీట మునిగిన పంటలు



**ఖమ్మం, మే 3:** రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. ఓ పక్క అకాల వర్షాలు అతలాకుతలం చేస్తుంటే .. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కాంటాల కోసం రైతులు పడిగాపులు పడాల్సి వస్తోంది. రోజుల తరబడి వడ్లు కాంటా పెట్టకపోవడంతో ఆరిన వడ్లు మళ్లీ.. తడుస్తుండడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కాంటాలు పెట్టించడంలో ఆఫీసర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సెంటర్లు ఏర్పాటుచేసి కాంటాలు పెట్టేలోపే వాన పడడంతో ఇబ్బందులు తలెత్తాయని అన్నారు.. ఈ పరిస్థితుల్లో కొన్ని చోట్ల కాంటాలు పెట్టడం ఆలస్యం అయ్యింది. కాంటాలు చేయటంలో ఎక్కడా ఆలస్యం చేయడం లేదన్నారు. సకాలంలో కాంటాలు పెట్టి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు వాపోతున్నారు. మా ఆరుగాలపు శ్రమ ఫలించింది. పంట చేతికొచ్చింది. తేమ కోసం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టాం. ఒకటి రెండు రోజుల్లో కాంటాలు వేస్తే ఇక ఫలితం చేతికొచ్చినట్లే..' అనుకున్న అన్నదాతలను గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం అంతులేని నష్టాన్ని మిగిల్చింది. కూసుమంచి మండలంలో నష్ట తీవ్రత అధికంగా ఉంది. చేగొమ్మ గ్రామంలో ధాన్యపు రాసులు నీట మునిగాయి. గాలిదుమారానికి ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. వర్షానికి ధాన్యమంతా తడిచిముద్దయింది. అలాగే, మరో 10 రోజుల్లో కోయాల్సి ఉన్న మామిడి పండ్లు కూడా ఈదురుగాలులకు నేలరాలాయి. కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లోనూ, కల్లాల్లోనూ ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. తన ఏడాది కష్టాన్ని సుమారు గంటపాటు- వచ్చిన ఈదురుగాలి, వర్షం నేలపాలు చేశాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

### పునరుజ్జీవన దిశగా
# ప్రాణహిత-చేవెళ్ల

**ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ**



**కామారెడ్డి, మే 3:** జిల్లాలోని మల్టీస్టేజ్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన ప్రాణహిత-చేవెళ్ల పునరుజ్జీవన దిశగా సాగుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి జిల్లా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అనంతరం మీడియాతో మాట్లాడా రు. కామారెడ్డి ప్రజల జీవనాధారం ఈ ప్రాజెక్టు అని పేర్కొన్న ఆయన, ప్రాజెక్టు పూర్తయితే కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలలో రూ.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉ ందన్నారు. ఇటీ-వల ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమీక్షలో కూడా ప్రాజెక్టు పురోగతిపై చర్చించామని తెలిపారు. కొండం చెరువు వద్ద ప్రాణహిత ప్రాజెక్టు ప్రాథమికంగా 0.80 టీ-ఎంసీలకు డిజైన్ చేయబడిందని, అయితే గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ దీనిని 3.5 టీ-ఎంసీలకు పెంచారని షబ్బీర్ అలీ వివరించారు. ఇది వల్ల 9 గ్రామాలు , తండాలు ముంపుకు గురవుతాయని స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇటీ-వల జరిగిన సమీక్షలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి సైతం అభ్యంతరాలు తెలిపారని వెల్లడించిన షబ్బీర్ అలీ, త్వరలో పాత డిజైన్ ప్రకారమే పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పురోగతిలో భాగంగా ప్రభుత్వంస్థాయిలో భూసేకరణకు రూ. 23.15 కోట్ల నిధులు విడుదల చేయబడ్డాయని షబ్బీర్ అలీ తెలిపారు. దీంట్లో భాగంగా మొదటి విడతగా 316 ఎకరాల భూసేకరణను చేపట్టనున్నట్లు-, మొత్తం 619 మంది రైతులకు పరిహారం చెల్లించే పక్రియ ప్రారంభం అయిందని పేర్కొన్నారు. తిమ్మక్‌పల్లి వద్ద 1.4 టీ-ఎంసీల పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తామని, వెంటనే రెండో విడత భూసేకరణ ప్రారంభమవుతుందన్నారు. మొత్తం ప్రణాళిక ప్రకారం కామారెడ్డి నియోజకవర్గంలో 80 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్ల మృతి

**మలేషయాలో ఉన్న తండ్రిని రప్పించేలా కెటిఆర్ ఏర్పాట్లు**

**హైదరాబాద్,మే 3 :** నిర్మల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పెంబి మండలం లోతేర తండాకు చెందిన అక్కాచెల్లెళ్లు బాణావత్ మంజుల, బాణావత్ అశ్వినీలు శుక్రవారం ఎంసెట్ పరీక్ష రాసి తిరిగే సమయంలో ఆర్మూర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా విషాదాన్ని మిగిల్చగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. బాధిత కుటుంబానికి పూర్తి మద్దతుగా నిలుస్తామని భరోసా ఇచ్చిన కేటీఆర్, మృతుల తండ్రి బాణావత్ రెడ్డి ఉ పాధి నిమిత్తం మలేషియాలో ఉండటాన్ని గమనించి, వెంటనే ఆయనను తెలంగాణకు తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. కేటీఆర్ ఆదేశాల మేరకు ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి అర్ధరాత్రి దాకా వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల మేనమామ కుటుంబానికి అండగా నిలిచి, వైద్యులు, అధికారులు, పోలీసులతో సమన్వయం చేసి మరణాంతర పక్రియను వేగవంతం చేశారు. అనంతరం మృతదేహాలను అంబులెన్స్ ద్వారా స్వగ్రామం లోతేర తండాకు తరలించి, అంత్యక్రియలకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ.. చిన్నవయసులోనే ప్రాణాలు కోల్పోయిన మంజుల, అశ్వినీలు భవిష్యత్తులో ఎంతో సాధించగలిగే విద్యార్థినులు అని, వారి మృతి తీరనిగాయమన్నారు. విదేశాల్లో ఉన్న తండ్రిని వెంటనే రావాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో కేటీఆర్ తక్షణ చర్యలు చేపట్టారని తెలిపారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ఆలస్యం

**సన్నం బియ్యం పంపిణీపై మంత్రి పొన్నం వెల్లడి**


**హిమాయత్ నగర్‌లో బియ్యం పంపిణీ ప్రారంభించిన మంత్రి**



**హైదరాబాద్, మే 3:** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్లే హైదరాబాద్‌లో రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ ఆలస్యమైందని హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హిమాయత్ నగర్ ఆదర్శ బస్తీలో పౌరసరఫరాల దుకాణం 602లో లబ్ధిదారులకు సన్న బియ్యం ఆయన సన్న బియ్యం పంపిణీ చేశారు. అనంతరం నారాయణగూడ గాంధీ కుటీర్ వద్ద సన్న బియ్యం లబ్ధిదారుడు ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. భారతదేశంలో మొదటిసారి ధనవంతుడు, పేదవాడు అనే తేడా లేకుండా.. అందరూ సన్న బియ్యం తినాలనే ఉ ద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉగాది పండగ నుంచి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయమని.. ఈ పథకం పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ఎన్నికల కోడ్ వల్ల ఏప్రిల్ నెలలో సన్న బియ్యం పంపిణీ చేయలేదన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి హైదరాబాద్‌లోని 653 రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని.. కనీసం మార్పులు చేర్పులు కూడా చేయలేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం కుల గణన సర్వే, ప్రజా వాణి అప్లికేషన్, రెగ్యులర్‌గా ఎమ్మార్వో ఆఫీస్‌ల నుంచి వచ్చిన అప్లికేషన్‌ల ద్వారా రేషన్ కార్డులు ఇచ్చే పక్రియ జరుగుతుందన్నారు. హైదరాబాద్ సమగ్ర అభివృద్ధిపై ముందుకు వెళ్తామన్నారు. హైదరాబాద్ ప్రజలు ఈ సన్న బియ్యం పథకాన్ని ఉపయోగించుకొని ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

# బెంగళూరులో ట్రాఫిక్ చిక్కులకు చెక్

**మే 15ను అమల్లోకి ఎల్లో మెట్రో లైన్**



**బెంగళూరు, మే 3:** ఐటీ పరిశ్రమ విస్తరణతో ఇండియన్ సిలికాన్ వ్యాలీగా గుర్తింపు తెచ్చుకున్న బెంగళూరులోని -టె-క్కీలను చాలా కాలంగా పీడిస్తున్న ట్రాఫిక్ విషయంలో శుభవార్త చెప్పింది. సరైన మెట్రో కనెక్టివిటీ లేకపోవటం కూడా చాలా మంది సొంత వాహనాలపై వెళ్లాల్సిన పరిస్థితిని కల్పిస్తోంది. అయితే ప్రస్తుతం బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ టెక్కీలకు ఒక శు భవార్తను ప్రకటించింది. చాలా కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న మెట్రో ఎల్లో లైన్ మే 15 నుంచి అందుబాటులోకి రానున్నట్లు నమ్మ మెట్రో వెల్లడించింది. ఈ రూటు ఆర్వీ రోడ్ నుంచి బొమ్మసంద్ర వరకు ప్రయాణికులు సులువు చేయనుంది. అలాగే ఎలక్ట్రానిక్ సిటీ ప్రాంతంలో నివసించే లక్షల మంది ఐటీ ఉద్యోగులకు ఎల్లో లైన్ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనుంది. కొత్తగా మెట్రో ఎల్లో లైన్ రూటు- అందుబాటు-లోకి రావటం వల్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గటంతో పాటు ఉద్యోగులకు ప్రయాణ సమయం ఆదా అవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విప్రో, ఇన్ఫోసిస్, హెచ్సీఎల్ వంటి దిగ్గజ టెక్ కంపెనీల ఆఫీసులు ఉన్న ఈ ప్రాంతంలో రద్దీ సమస్యలు తగ్గనున్నాయని అధికారులు చెబుతున్నారు. బొమ్మసంద్ర నుంచి ఎలక్ట్రానిక్ సిటీకి కేవలం 6 కిలోమీటర్ల దూరం ఉండటంతో మెట్రో కనెక్టివిటీ ద్వారా కేవలం కొన్ని నిమిషాల ప్రయాణంతోనే గమ్యస్థానానికి చేరుకోవచ్చని టెక్కీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఫిబ్రవరి 14న చైనాలో తయారైన 6 కోచెస్ బెంగళూరుకు చేరుకున్నాయి. త్వరలోనే ఇలాంటివి మరో ఆరింటిని తీసుకురానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ రూట్ స్టార్ట్ అయితే ప్రయాణికులు ఇండస్ట్రియల్ హబ్, రెసిడెన్షియల్ హబ్ మధ్య ప్రయాణం సుగమం అవుతుందని మెట్రో వర్గాలు చెబుతున్నాయి.

# అమరావతి అభివృద్ధితో ఎపికి మహర్దశ

**ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు**

**అమరావతి, మే 3:** ప్రజల సహకారం, కేంద్ర మద్దతు, పక్కా ప్రణాళికతో అమరావతిని నిర్మిస్తామని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. భారత్ ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా పునర్నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం జరిగిందని అన్నారు. పునర్నిర్మాణ పనుల ప్రారంభం విజయవంతంపై ఎక్స్ లో సిఎం స్పందించారు. కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియా, సోషల్ మీడియాకు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదకశక్తిగా నిలిచేలా నిర్మాణం జరుగుతుందని చెప్పారు. తమకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతి పునః ప్రారంభంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఏపీ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ లో ప్రధాని ఇలా రాసుకొచ్చారు.. అమరావతి అభివృద్ధిలో నూతన, చారిత్రాత్మక అధ్యాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని నా సోదర, సోదరీమణుల మధ్య ఉండటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అమరావతి భవిష్యత్ పట్టణ కేంద్రంగా ఆవిర్భవిస్తుంది.. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథాన్ని మెరుగు పరుస్తుందని నేను విశ్వసిస్తున్నాను అని చెప్పుకొచ్చారు. నాకు మంచి మిత్రుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకి అమరావతి పట్ల ఉన్న దార్శనికత, రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్ల ఆయనకున్న నిబద్ధతను నేను అభినందిస్తున్నాను అని ప్రధాని మోడీ రాసుకొచ్చారు. ఇక, ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా జరిగిన రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను అని సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు, మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లిన మీడియా, సోషల్ మీడియా వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను అన్నారు. కాగా, ప్రజల సహకారంతో, కేంద్రం మద్దతుతో పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీ-గా రాజధాని అమరావతిని నిర్మిస్తాం అని హామీ ఇచ్చారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి.. మాకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని తెలుపుతూ.. ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని చంద్రబాబు వెల్లడించారు. మరోవైపు, రాజధాని అమరావతి నిర్మాణ పనులను ఏపీ ప్రభుత్వం వేగవంతం చేస్తుంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా పునః ప్రారంభోత్సవం కార్యక్రమం పూర్తి కావడంతో పనులు వేగవంతం చేసింది. ఐకానిక్ భవనాల డిజైన్లు ఖరారు చేసేందుకు చర్చలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే డిజైన్లు రూపొందిస్తున్న సంస్థలతో మంత్రి నారాయణ మాట్లాడుతున్నారు. సీఆర్డీయే కార్యాలయంలో నార్మన్ పోస్టర్, హాఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్ అండ్ టీ- సంస్థల ప్రతినిధులతో మంత్రి సమావేశం అయ్యారు.

# తమిళ జాలర్లపై సముద్ర దొంగల దాడి

**17మంది మత్స్యకారులకు గాయాలు**



**చెన్నై, మే 3:** చేపలు పట్టేందుకు వెళ్లిన తమిళనాడు మత్స్యకారులపై సముద్రపు దొంగలు దాడి చేశారు. ఈ ఘటన శుక్రవారం కోరమండల్ తీరంలో జరిగినట్లు తెలుస్తోంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని నాగపట్నం జిల్లాకు చెందిన 30 మందికి పైగా మత్స్యకారులపై కోరమండల్ తీరంలో చేపలు పడుతుండగా శ్రీలంక సముద్రపు దొంగల గ్యాంగ్ దాడి చేసింది. ఈ దాడిలో 17 మంది గాయపడ్డారు. కోడియక్కరైకి ఆగ్నేయంగా ఫైబర్ బోట్‌లో సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులపై స్పీడ్ బోట్‌లో వచ్చిన ఆరుగురు దొంగల ముఠా పదునైన ఆయుధాలతో దాడి చేశారు. తర్వాత ఏ÷ూ పరికరాలు, ఫిషింగ్ వలలను దోచుకున్నారు. దొంగిలించిన వస్తువుల విలువ దాదాపు రూ. 10 లక్షలు బాధిత మత్స్యకారులు తెలిపారు. ఒడ్డుకు తిరిగి వచ్చిన తర్వాత గాయపడిన 17 మంది మత్స్యకారులు చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు.

# పోరాడి ఓడిన చెన్నై

## ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఆర్సీబీదే పైచేయి..




క్రికెట్ అభిమానులకు అసలు సిసలు మజా అందించింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ క్రికెట్ అభిమానులను చివరి బంతి వరకు అలరించింది. చివరకు ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఆర్సీబీ గెలుపొందింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరింది. రెండు పరుగుల తేడాతో చెన్నైపై ఉత్కంఠభరిత విజయం సాధించింది. ప్లే ఆఫ్స్ అవకాశాలకు దూరమై ఈ సీజన్ ట్రోఫీకి దూరమైన చెన్నై సూపర్ కింగ్స్ నామమాత్రపు మ్యాచ్‌లో చక్కటి ఆటతీరు ప్రదర్శించింది. ఓపెనర్ ఆయుష్ మాత్రే (94) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు.

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. చెన్నై కెప్టెన్ ధోనీ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన కోహ్లీ సంచలన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 33 బంతుల్లో 62 పరుగులు చేసి అవుటయ్యాడు. అతడి ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు ఉన్నాయి. మరో ఓపెనర్ జాకబ్ బెతల్ (55) కూడా చక్కగా ఆడి హాఫ్ సెంచరీ చేశాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 97 పరుగుల జోడించారు. చివర్లో షెపర్డ్ (14 బంతుల్లో 53 పరుగులు) ఈ సీజన్‌లో వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసి బెంగళూరుకు భారీ స్కోరు అందించాడు. సిక్స్‌లు, ఫోర్లతో స్టేడియంను హోరెత్తించాడు. దీంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 213 పరుగులు చేసింది. చెన్నై బౌలర్లలో మహేష్ పతిరణ మూడు వికెట్లు తీశాడు. నూర్ అహ్మద్, సామ్ కరన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

ఆర్సీబీ నిర్దేశించిన 214 పరుగుల లక్ష్య ఛేదనలో చెన్నై దీటుగా స్పందించింది. ఆయుష్ మాత్రే (94) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ షేక్ రషీద్ (14)తో కలిసి తొలి వికెట్‌కు 51 పరుగులు జోడించాడు. రషీద్ అవుటైన తర్వాత వచ్చిన సామ్ కరన్ (5) ఎక్కువ సేపు క్రీజులో ఉండలేకపోయాడు. ఆ తర్వాత వచ్చిన రవీంద్ర జడేజా (74) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆయుష్‌తో కలిసి మూడో వికెట్‌కు 114 పరుగులు జోడించాడు. సెంచరీకి చేరువలో ఉండగా ఆయుష్ అవుటయ్యాడు.

ఆ తర్వాత బంతికే బ్రేవిస్ పెవిలియన్ చేరాడు. చివర్లో ధోనీ (12) చెన్నైకు గెలిపించడానికి ప్రయత్నించాడు. అయితే బెంగళూరు బౌలర్లు చివర్లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మ్యాచ్ చివరి వరకు వచ్చింది. చివరి బంతికి నాలుగు పరుగులు చేయాల్సిన దశలో చెన్నై బ్యాటర్ సింగిల్ మాత్రమే చేయడంతో ఆర్సీబీ విజయం సాధించింది.





# ఆసియా కప్ టోర్నీ నిర్వహణ ప్రశ్నార్థకం?

మ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి వల్ల భారత్- పాకిస్థాన్ మధ్య క్రికెట్ సంబంధాలపై ఎఫెక్ట్? పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జరగాల్సిన 2025 ఆసియా కప్ టోర్నమెంట్?లో భారత్ పాల్గొనడంపై గందరగోళం నెలకొంది. ఒకవేళ భారత్ లేకపోతే టోర్నీకి ఆదరణే ఉండదు. స్పాన్సర్లు కూడా ఆసక్తి కనబర్చరు. అందుకే ప్రస్తుత పరిస్థితుల కారణంగా టోర్నీ వాయిదా పడే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.'ఆసియా కప్? సెప్టెంబర్?లో జరగనుంది. ఈసారి టోర్నీకి ఆతిథ్య హక్కులు భారత్ వద్దే ఉన్నాయి. కానీ, టోర్నీని యూఏఈ లేదా శ్రీలంక వేదికగా నిర్వహించే ఛాన్స్ ఉంది. షెడ్యూల్ కూడా ప్రకటించాల్సి ఉంది. అయితే ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఆసియా కప్ వాయిదా పడే అవకాశం ఉంది. భారత్- పాకిస్థాన్ మధ్య ఇప్పుడు సంబంధాలు సరిగ్గా లేవు. ఇలాంటి పరిస్థితుల్లో టోర్నీ నిర్వహించే అవకాశాలు చాలా తక్కువ' అని క్రికెట్ వర్గాలు తెలిపాయి. గతంలో ఎప్పుడూ లేనట్లుగా ఈసారి గ్రాండ్?గా నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నారు. టోర్నీలో 8 జట్లు టీ20 ఫార్మాట్?లో తలపడేలా ప్లాన్ చేశారు. కొత్తగా ఒమన్, హాంగ్ కాంగ్ ఆసియా కప్?లో ఆడనున్నాయి. భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఒమన్, హాంగ్?కాంగ్ జట్లు పోటీ పడనున్నాయి. 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించి మ్యాచ్?లు నిర్వహించేలా ప్లాన్ చేశారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల వల్ల టోర్నీ నిర్వహణే ప్రశ్నార్థకంగా మారింది.భారత సీనియర్ పురుషుల జట్టు ఆగస్టులో బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. ఈ టూర్?లో బంగ్లాతో మూడు వన్డే, మూడు టీ20లు ఆడాల్సి ఉంది. అయితే బంగ్లాదేశ్ పర్యటనకు కూడా భారత్ వెళ్లే అవకాశం తక్కువేనని తెలుస్తోంది. ఐసీసీ క్యాలెండర్ ఇయర్‌లో బంగ్లాదేశ్‌తో సిరీస్? ఆడేందుకు వీలు ఉంది. కానీ, ఇది కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. భారత్‌కు సంబంధించిన రాష్ట్రాలపై ఆ దేశ నేత చేసిన కామెంట్స్? దీనికి కారణం' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.కాగా, ఇరు దేశాల మధ్య భద్రతా కారణాల వల్ల గతంలోనే భారత్-పాక్ ద్వైపాక్షిక సిరీస్?లు రద్దయ్యాయి. ఈ రెండు జట్లు ప్రస్తుతం ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతున్నాయి. అయితే ఈ విషయంలోనూ ఐసీసీ దృష్టిపెట్టాలని రీసెంట్?గా బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పేర్కొన్నారు. మరోవైపు పాక్?తో పూర్తిగా క్రికెట్ సంబంధాలు తెంచుకోవాలని పలువురు మాజీలు అభిప్రాయపడ్డారు.

# హైదరాబాద్ కి ఇంకా ఛాన్స్ ఉందా?

ఐపీఎల్ 2025లో సన్ రైజర్స్ హైదరాబాద్ 7వ ఓటమిని మూటగట్టుకుంది. తాజాగా గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచులోనూ ఓడిపోయి..ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం చేసుకుంది. ప్లే ఆఫ్స్ రేస్ నుంచి ఇప్పటికే చెన్నై, రాజస్థాన్ ఔటయ్యాయి. అయితే ఈ రేసులో సన్ రైజర్స్ వెనకంజలో ఉన్నప్పటికీ ఆరెంజ్ ఆర్మీ జర్నీ ఇంకా క్లోజ్ అవ్వలేదు. ఇప్పటికీ టాప్ 4లోనే నిలించేందుకు సన్ రైజర్స్ కు ఛాన్స్ ఉంది. ఎలాగో చూద్దాం. ఈ సీజన్ లో సన్ రైజర్స్ ఇప్పటి వరకు 10 మ్యాచులు ఆడింది. ఇందులో మూడు మ్యాచుల్లో నెగ్గింది. 7 మ్యాచులు ఓడిపోయింది. ప్రస్తుతం ఆరెంజ్ ఆర్మీ 6 పాయింట్లతో తొమ్మిదవ స్థానంలో కొనసాగుతోంది. దీంతో సన్ రైజర్స్ ప్లే ఆఫ్స్ కు చేరడం ఎలాగోనని అభిమానులు లెక్కలేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఆర్ హెచ్ టాప్ 4లో నిలిచేందుకు 8 నుంచి 10శాతం అవకాశం ఉంది. సన్ రైజర్స్ ఈ సీజన్ లో ఇంకా 4 మ్యాచులు ఆడాల్సి ఉంది. టాప్ 4లో నిలవాలంటే ఇకపై అన్ని మ్యాచుల్లో కచ్చితంగా విజయం సాధించాల్సి ఉంది. అప్పుడే 7 విజయాలు 14 పాయింట్లతో టాప్ 4 రేసులో ఉంటుంది. గతంలో చాలా సార్లు 14 పాయింట్లతో పలు జట్లు ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించాయి. ఈ లెక్కన ఈసారి సన్ రైజర్స్ కూడా ఆ విధంగానే టాప్ లో నిలిచే అవకాశం ఉంది. అయితే సన్ రైజర్స్ నెట్ రన్ రేట్ ఘోరంగా ఉంది. అందుకే హైదరాబాద్ కు భారీ విజయాలు అవసరం ఉన్నాయి. మూడు కంటే ఎక్కువ జట్లు 14కు మించి ఎక్కువ పాయింట్లను సంపాదించకూడదు. అప్పుడే సన్ రైజర్స్ 14 పాయింట్లతో టాప్ 4లో ఉంటుంది. ఇక్కడ నెట్ రన్ రేట్ అత్యంత కీలకం. రన్ రేట్ మెరుగ్గా లేనట్లయితే అసాధ్యం. ఈ లెక్కన హైదరాబాద్ ఇతర జట్ల ఫలితాలపైనా ఆధారపడాల్సింది. ముఖ్యంగా ముంబై, ఆర్సీబీ , గుజరాత్, పంజాబ్ తదుపరి మ్యాచ్ ల ఫలితాలు సన్ రైజర్స్ క్వాలిఫైయింగ్ అవకాశాలపై ప్రభావం చూపుతాయి. హైదరాబాద్ తన తదుపరి మ్యాచ్ లు ఢిల్లీ, కోల్ కతా, ఆర్సీబీ, లఖ్ నవూ జట్లతో తలపడాల్సి ఉంటుంది. ఇందులో ఒక్క మ్యాచులో ఓడినా సన్ రైజర్స్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. గత ఏడాది ఆర్సీబీ ఒక్క శాతం అవకాశంను కూడా వదలకుండా పోరాడి టాప్ 4లోకి దూసుకువచ్చింది. ఈసారి అదే స్ఫూర్తితో సన్ రైజర్స్ పోరాడితే ప్లే బెర్త్ ఖాయం చేసుకోవడం పక్కా. అయితే ఈ ప్రెడిక్షన్ కాస్త కష్టంగానే ఉన్నా అసాధ్యమేమీ అవ్వదు. ఐపీఎల్ వంటి టోర్నీలో చివరి వరకు ఏదైనా జరగవచ్చు. అందుకే సన్ రైజర్స్ పట్టు వదలకుండా పోరాడాల్సి ఉంది.






# ప్లే ఆఫ్ రేసులో ఆ నాలుగు జట్లు!?

ఐపీఎల్ 2025 సీజన్ 18లో ఇప్పటి వరకు 51 మ్యాచ్‌లు జరిగాయి. అట్టడుగున ఉన్న జట్ల సంగతి పక్కనబెడితే మిగిలిన జట్లలో ప్లే ఆఫ్ ఎవరు చేరుతారనేది ఆసక్తి కల్గిస్తోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ తరువాత ఇది మరింత రసవత్తరంగా మారింది. ఐపీఎల్ 2025 సీజన్ 18 ప్లే ఆఫ్ మ్యాచ్‌లు త్వరలో ప్రారంభం కానున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన 51వ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ విజయంతో ప్లే ఆఫ్ రేసు ఆసక్తిగా మారింది. పది మ్యాచ్‌లు ఆడిన గుజరాత్ టైటాన్స్ 7 విజయాలతో ఏకంగా రెండో స్థానానికి చేరింది. మిగిలిన నాలుగు మ్యాచ్‌లలో ఒక్కటి గెలిస్తే చాలు గుజరాత్ ప్లే ఆఫ్‌కు చేరుతుంది. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆడిన 10 మ్యాచ్‌లలో 6 పాయింట్లతో 9వ స్థానంలో ఉంది. మిగిలిన నాలుగు మ్యాచ్‌లు గెలిచినా 14 పాయింట్లు లభిస్తాయి. ప్లే ఆఫ్ అవకాశాలు ఈ జట్టుకు దాదాపుగా పోయినట్టే.

ముంబై ఇండియన్స్ 11 మ్యాచ్‌లలో 14 పాయింట్లు
గుజరాత్ టైటాన్స్ 10 మ్యాచ్‌లలో 14 పాయింట్లు
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 10 మ్యాచ్‌లలో 14 పాయింట్లు
పంజాబ్ కింగ్స్ 10 మ్యాచ్‌లలో 13 పాయింట్లు
ఢిల్లీ కేపిటల్స్ జట్టు 10 మ్యాచ్‌లలో 12 పాయింట్లు
లక్నో సూపర్ జెయింట్స్ జట్టు 10 మ్యాచ్‌లలో 10 పాయింట్లు
కోల్‌కతా నైట్‌రైడర్స్ 10 మ్యాచ్‌లలో 9 పాయింట్లు
రాజస్థాన్ రాయల్స్ జట్టు 11 మ్యాచ్‌లలో 6 పాయింట్లు
సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 10 మ్యాచ్‌లలో 6 పాయింట్లు
చెన్నై సూపర్ కింగ్స్ జట్టు 10 మ్యాచ్‌లలో 4 పాయింట్లు

ఇప్పటి వరకు ఉన్న పాయింట్ల లెక్కల ప్రకారం ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు మరో మ్యాచ్ గెలిస్తే చాలు ప్లే ఆఫ్ కు చేరిపోతాయి. ఇక పంజాబ్ కింగ్స్ లెవెన్ 3 పాయింట్లు, ఢిల్లీ కేపిటల్స్ 4 పాయింట్లు సాధించాల్సి ఉంటుంది. నాలుగో ప్లే ఆఫ్ స్థానం కోసం పంజాబ్ కింగ్స్ లెవెన్ వర్సెస్ఢిల్లీ కేపిటల్స్ మధ్య గట్టి పోటీ ఉండవచ్చు. ఈ రెండు జట్లలోనే ఒక జట్టుకు నాలుగో ప్లే ఆఫ్ స్థానం ఖాయం కానుంది.



## చిరు సరసన మరోమారు నయనతార

### అనిల్ రావిపూడి చిత్రం కోసం ప్రయత్నాలు

చిరంజీవి, అనిల్ రావిపూడి కలయికలో వస్తున్న చిత్రంపై అనేకానేక ఊహాగానాలు వస్తున్నాయి. ఇందులో చిరుకు సరసన నయనతారను తీసుకుంటున్నట్లు వార్తలు వచ్చాయి. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్న ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే లాంఛనంగా ప్రారంభమైన ఈ చిత్రం ఇప్పుడు రెగ్యులర్ చిత్రీకరణకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే మిగిలిన ప్రధాన తారాగణాన్ని ఖరారు చేసే పనిలో చిత్రబృందం పడింది. ఇందులో చిరుకు జోడీగా ఇద్దరు కథానాయికలు కనిపించనున్నట్లు- ఇప్పటికే వార్తలొచ్చాయి. కాగా, అందులో ఓ నాయిక పాత్ర కోసం నటి నయనతారను తీసుకునేందుకు చిత్ర వర్గాలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై నయన్‌తో చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లు- జరిగితే ఇది చిరు - నయన్‌ల కాంబోలో హ్యాట్రిక్ సినిమా కానుంది. వీళ్లిద్దరూ గతంలో 'సైరా నరసింహారెడ్డి', 'గాడ్ ఫాదర్' సినిమాల్లో కలిసి సందడి చేశారు. ఇక ఈ చిత్రంలో మరో పాత్ర కోసం ఓ యువ నాయికను ఖరారు చేయనున్నారు. వినోదం, యాక్షన్, కుటుంబ అంశాలతో అల్లుకున్న కథతో రూపొందనున్న చిత్రమిది. చిరంజీవి దీంట్లో శివ శంకర వరప్రసాద్‌గా తన ఒరిజినల్ పేరుతో ఉన్న పాత్రలో కనిపించనున్నారు. హీరో వెంకటేశ్ ఓ ప్రత్యేక పాత్రలో సందడి చేయనున్నారు. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.



## శ్రీలీలకు మరో లక్కీ ఛాన్స్

ఒక్కప్పుడు ఐటమ్ సాంగ్స్ కోసం సెపరేట్ గా కొంత మంది హాట్ బ్యూటీలు ఉండే వారు. లేదంటే సెపరేట్‌గా కొంత మోడల్స్ అని ఐటెం గర్ల్స్ అని విదేశాల నుంచి తెల్ల తోలు బ్యూటీలని దింపే వారు. ఎందుకంటే హీరోయిన్‌లు ఇలాంటి పాటలు చేయడానికి నిరకరించేవారు. కానీ ప్రజంట్ స్టార్ హీరోయిన్స్ మాత్రం ఐటెం సాంగ్స్ చేసేందుకు ఏ మాత్రం వెనకాడడం లేదు. క్రేజ్‌కి క్రేజ్, రెమ్యునరేషన్‌కి రెమ్యునరేషన్ వస్తుండడంతో అసలు వదులుకోవడం లేదు. ఇందులో భాగంగా తాజాగా టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల.. మరో స్టార్ హీరోతో ఐటెం సాంగ్ చేసే ఛాన్స్ దక్కిందట. మెగా హీరో రామ్ చరణ్ నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'పెద్ది'. ఉప్పెన' ఫేమ్ సానా బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వ్రిద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లు సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా, ఇందులో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం ఇందులో ఓ మాస్ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నాడట బుచ్చిబాబు. దీని కోసం రామ్ చరణ్ సరసన శ్రీ లీల స్టెప్పులు చేయబోతోందట. ఈ ఫుల్ ఎనర్జిటిక్ మాస్ సాంగ్‌తో థియేటర్ దద్దరిల్లేలా చేయనుందట శ్రీలీల. ఈ వార్తల్లో ఎంత వరకు నిజం ఉందో తేలినప్పటికీ ప్రజంట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.



## డ్యాన్స్‌లో నంబర్ వన్!

బాలీవుడ్‌లో నెలకో స్టార్‌కిడ్ పరిచయం అవుతున్నారు. అయితే.. వారిలో కొందరు ప్రేక్షకులను ఆకట్టుకోగలిగితే, మరికొందరు ట్రోల్స్‌కు గురవుతున్నారు. కానీ, సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని మాత్రం.. మొదటి కోవలోకే వస్తుందని అంటున్నాడు బాలీవుడ్ స్టార్ కొరియోగ్రాఫర్ రెమో డిసౌజా. తాజాగా, ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. రాషా తడానీని ఆకాశానికి ఎత్తాడు. ఆజాద్ సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది రాషా. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద విఫలమైనప్పటికీ, ఈ అమ్మడు మాత్రం విమర్శకుల ప్రశంసలు అందుకున్నది. నటనతోపాటు అద్భుతమైన డ్యాన్స్‌తో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టింది. ఇదే విషయాన్ని మీడియాతో పంచుకుంటూ.. పరిశ్రమలో ఇప్పుడున్న వారిలో రాషా మాత్రమే మంచి డ్యాన్సర్‌గా రాణించగలదని అన్నాడు రెమో డిసౌజా. "ఒక అమ్మాయిని చూశాను. ఆమె డ్యాన్స్ అద్భుతంగా ఉంది. భవిష్యత్తులో.. ఆమె అద్భుతమైన డ్యాన్సర్‌గా రాణిస్తుందని అనుకుంటున్నా. ఆమే.. రాషా తడాని. ఆమె నటనతోపాటు డ్యాన్స్‌లోనూ అదరగొడుతున్నది" అంటూ చెప్పుకొచ్చాడు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మలైకా అరోరా కూడా.. రెమోతో ఏకీభవించింది. ఆమె కూడా రాషాపై ప్రశంసల వర్షం కురిపించింది. "ఆమె అద్భుతమైన డ్యాన్సర్! ఇండస్ట్రీలోకి వస్తున్న యువనటీనటులు తమను తాము నిరూపించుకోవాలి. రాషా మాత్రం.. ఇప్పటికే తానేంటో నిరూపించుకున్నది" అంటూ కొనియాడింది. తన మొదటి చిత్రం 'ఆజాద్'లో ఉయ్ అమ్మా, బిరంగే పాటల్లో అద్భుతమైన నృత్యంతో ఆకట్టుకున్నది రాషా. తన తల్లి రవీనా టాండన్, గోవిందా 2002లో చేసిన ఐకానిక్ సాంగ్.. 'అఖియోం సే గోలి మారే'ను ఇటీవల రీ క్రియేట్ చేసింది రాషా. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతుండగా.. రాషా డ్యాన్స్ స్కిల్స్‌కు నెటిజన్లంతా ఫిదా అవుతున్నారు.


## మరోమారు జోడీ కట్టబోతున్న రష్మిక, విజయ్

ఆన్‌స్క్రీన్‌పై కొన్ని జోడీలకు ప్రత్యేకమైన ఫ్యాన్స్ ఉంటారు. అలాంటి ఓ జోడీనే విజయ్ దేవరకొండ- రష్మికలదని చెప్పవచ్చు. వీరిద్దరూ కలిసి వెండితెరపై రెండుసార్లు సందడి చేశారు. వీరిద్దరూ కలిసి 'గీత గోవిందం'లో నటించి మంచి ఆన్‌స్క్రీన్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. దీని తర్వాత 'డియర్ కామ్రేడ్'తో అలరించారు. ఈ చిత్రం కమర్షియల్‌గా హిట్ కాకపోయినప్పటికీ యూత్‌కు బాగా కనెక్ట్ అయింది. కెరీర్‌లో ఎన్ని సినిమాలు చేసినా ఈ చిత్రం వారికెంతో ప్రత్యేకమని గతంలో విజయ్, రష్మిక ఇద్దరూ వెల్లడించారు. ఇప్పుడు ఈ జోడీ మరోసారి ప్రేక్షకులను పలకరించనున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా మైత్రీ మూవీస్ పెట్టిన ఓ పోస్ట్‌కు రష్మిక రి÷-లపై ఇవ్వడంతో ఆ వార్తలకు బలం చేకూరింది. విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'కింగ్‌డమ్'తో బిజీగా ఉన్నారు. దీనితో పాటు ఆయన మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందనున్న ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే నెల నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. ఇప్పుడీ చిత్రంలో విజయ్ సరసన రష్మిక నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై నిర్మాణసంస్థ ఓ పోస్ట్ పెట్టింది. వేచి చూద్దాం అని అర్థం వచ్చేలా ఉంది. దీనికి రష్మిక ఓకే..' అంటూ నవ్వుతున్న ఎమోజీలను పోస్ట్ చేశారు. దీంతో వీరిద్దరి జోడీ ఖరారైందని అభిమానులు భావిస్తున్నారు. ఇదే నిజమైతే ముచ్చటగా మూడోసారి ఈ జోడీని చూడొచ్చని సంబరపడుతున్నారు.



## ప్యారడైజ్ షూటింగ్ ప్రారంభం

### నాని లేకుండానే చిన్ననాటి ఘటనలపై షూట్



నాని హీరోగా నటించిన హిట్ థర్డ్ కేస్ అద్భుతమైన వసూళ్లు సాధిస్తూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. మొదటి రోజు 43 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించిన ఈ చిత్రం, రెండో రోజు 29 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ రాబట్టినట్లు- ప్రచారం జరుగుతోంది. ఆ సంగతి పక్కన పెడితే, ది ప్యారడైజ్ షూటింగ్ నుంచి ప్రారంభమైంది. అయితే, ఇంకా హిట్ ప్రమోషన్స్‌లో బిజీగా ఉండడంతో నాని షూట్‌లో పాల్గొనడం లేదు. ఈ నేపథ్యంలోనే నాని చిన్ననాటి ఎపిసోడ్ షూట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నాని అమెరికా ప్రమోషన్స్ కోసం వెళ్లారు. ఆయన అమెరికా నుంచి తిరిగి వచ్చి కొంత రెస్ట్ తీసుకోబోతున్నాడు. ఆ తర్వాత నాని కూడా ఈ షూట్‌లో జాయిన్ కాబోతున్నాడని, 18 నుంచి జరగబోయే షూట్‌లో పాల్గొనబోతున్నట్లు- తెలుస్తోంది. ఇక ముందుగా టాకీ పార్ట్ కొంత షూట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. శ్రీకాంత్ ఓదెల డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం మీద భారీ అంచనాలు ఉన్నాయి. రిలీజ్ చేసిన గ్లింప్స్‌తోనే ఒక్కసారిగా ఈ సినిమా మీద అన్ని వర్గాల్లో చర్చ మొదలైంది. సికిందరాబాద్ ప్యారడైజ్ ప్రాంతం నేపథ్యంలో ఈ కథ సాగుతున్నట్లు- ప్రచారం జరుగుతోంది. ఒక రకంగా రియల్ ఇన్సిడెంట్స్‌ని బేస్ చేసుకుని కథ రాసుకున్నట్లు- కూడా ప్రచారం జరుగుతోంది, కానీ దీనికి సంబంధించిన అధికారిక క్లారిటీ- ఇంకా లేదు. ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను సహనిర్మాణం చేసేందుకు సరిగమ సంస్థ కూడా రంగంలోకి దిగినట్లు చెబుతున్నారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463